honeybee.org

Vol-11 Issue-6

వెల : రూ. 20/-

సంపుటి 11 సంచిక 6 సెప్టెంబర్ - అక్టోబర్ 2023

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక




























సృజనాత్మక రైతు చిన్ని కృష్ణుడు కథనాన్ని ఈ సంచిక 20వ పేజీలో చూడండి

సంపుటి-11 సంచిక - 6 సెప్టెంబర్ - అక్టోబర్ 2023

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-40253096, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్మలమడక శ్రీకర్**
**డా. కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్**, హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 400/-**
**for 2 years Subscription**

## ఈ సంచికలో.....

* పట్టు వ్యవసాయం చేసే రైతుల వెతలు తీర్చిన 'ప్రవీణ్ కుమార్' - 4
* 'టెడెక్స్' లో పల్లెసృజన వాణి - 8
* వరిలో అద్భుతాలు సృష్టించిన చైన్ వీడర్ - 9
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 10
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 13
* 'హనీబీ' ప్రేరణ గొలిపే కథ - పెద్ద సమస్యకు చిన్న పరిష్కారం - 18
* 'మోధా శివకుమార్'కు ప్రతిష్ఠాత్మక "ఇన్‌ఫోసిస్ ఫౌండేషన్ - ఆరోహన్-2023 స్పెషల్ జ్యూరీ" పురస్కారం - 19
* రంగు రంగుల వరి విత్తనాలతో పొలంలో బొమ్మలు రైతు చిన్ని కృష్ణుడు చేసిన విశిష్ట సృజన - 20
* పల్లె జ్ఞానం - 22
* పోచంపల్లి నేత కుటుంబాల జీవితాల్లో రంగులు నింపిన 'పద్మశ్రీ' మల్లేశం - 24
* వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా అభివృద్ధి చేయబడ్డ 'చీరల రోలింగ్ యంత్రం' - 27
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 29
* స్పందన - 31

**కవర్ లోపలి పేజీల్లో ...**
రైతుల కొరకు రైతులు తయారు చేసిన ఇన్నోవేషన్లు
**మధ్య పేజీలో :**
సెప్టెంబర్ - అక్టోబర్ 2023 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. -500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# సోలార్ విద్యుత్ ఉత్పత్తి రైతులపై రుద్దడం సమంజసమా?

ఒకప్పుడు వ్యవసాయానికి అత్యవసరమైన నీటిని 'మోట' పద్ధతిలో తోడుకునేవారు. ఇందుకు మనుషులు లేదా పశువులను ఉపయోగించేవారు. గ్రామ ప్రజలు పశువుల సహాయంతో, నీటిని కాలువల ద్వారా పారించేవారు. తర్వాత డీజిల్ ఇంజన్లను వినియోగించారు. క్రమక్రమంగా విద్యుత్తు గ్రామాలకు చేరటంతో మోటార్ల వాడకం పెరిగింది. నీరు భూమి లోతుల్లోకి వెళ్ళడంతో విద్యుత్ మోటార్ల వినియోగం విరివిగా పెరిగింది. స్వల్ప సంఖ్యలో ఉన్న చిన్న, సన్నకమతాలను తప్పిస్తే, దాదాపు అందరు రైతులకు విద్యుత్ మోటారు కనీసం ఒకటైనా ఉంటుంది. విద్యుత్తుపై ఆధారపడడం రైతులకు మామూలైపోయింది. దాంతో దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇంధన ఆధారిత విద్యుత్తు డిమాండు చాలా పెరిగింది. ప్రభుత్వాలు ఈ డిమాండుకు తగ్గ విద్యుత్తు ఉత్పత్తికై ఎన్నో సాంకేతిక పద్ధతులను ఉపయోగించడం మొదలు పెట్టారు. విద్యుత్తుని నీటితో, బొగ్గుతో, అణు శక్తితో, సౌర శక్తితో, గాలితో.... ఇలా రకరకాల పద్ధతులను నూతన సాంకేతికతను ఉపయోగించి ఉత్పత్తిని పెంచడానికి ప్రయత్నిస్తునే ఉన్నారు. అయినా 'ఉత్పత్తి - అవసరం' మధ్య అంతరం పెరుగతునే ఉంది. ఉత్పత్తిని పెంచే క్రమంలో ప్రపంచమంతా వాతావరణ కాలుష్యంపై ఎక్కువ ధ్యాస పెట్టలేదు. ఇప్పుడు వాతావరణ కాలుష్యంపై అవగాహన, తక్కువవుతున్న ఆరోగ్య భద్రత, విద్యుత్ ఉత్పత్తుల విధానాలను మార్చవలసిన అవసరం ఏర్పడింది. గత పదేళ్ళుగా డీజిల్, గ్యాస్, బొగ్గులతో దేశంలో 57% విద్యుత్తు ఉత్పత్తి అవగా, నీరు, గాలి, సూర్యరశ్మి వంటివాటితో 42% ఉత్పత్తి అవుతుంది. ముఖ్యంగా సోలార్ శక్తితో మొత్తం దేశంలో 16% విద్యుత్తు ( 4.17 లక్షల మెగావాట్లు) దేశంలో ఉత్పత్తి అవుతుంది. మే 2023 గణాంకాల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు చెరి సగం విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నాయి.

మనం ప్రధానంగా రైతుల విద్యుత్తు అవసరాల గురించి చర్చిద్దాం. ప్రస్తుతం రైతులకు విద్యుత్తు అవసరం రోజుకు కనీసం 6-8 గంటలు. ఇది ముఖ్యంగా ఉదయం మరియు సాయంకాలం 3 గంటల పాటు విద్యుత్తు సరఫరా ఇస్తే నీరు చల్లటి సమయంలో పెట్టడం కుదురుతుంది. దీనివల్ల నీరు ఆదా అవుతుంది. ఊటలతో బావుల్లో  నీరు తిరిగి సమకూరుతుంది. రైతుకు విద్యుత్తు పంటకు అవసరమైనప్పుడు ఇవ్వాలి.

విద్యుత్తు ఉత్పత్తిని బొగ్గు, గ్యాస్, డీజిలు ద్వారా చేయకూడదన్న ప్రస్తుత వాతావరణ భద్రత, నిర్ణయాలను పాటించడానికి భారత ప్రభుత్వం సోలార్ శక్తితో విద్యుత్తు ఉత్పత్తిని పెద్దయెత్తున ప్రోత్సహిస్తున్నది. దీనికి కావలసిన చట్టాలు, ప్రోత్సాహకాలు, ప్రైవేటు రంగానికి ప్రాధాన్యతలు.... ఇలా ఎన్నో జాతీయ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలలో అమలు చేస్తున్నారు. ఒక వింత విషయం ఏమిటంటే, ఉత్పత్తి బాధ్యతలను వినియోగదారులపై తోసివేస్తున్నారు. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి, ప్రభుత్వ బాధ్యత మరియు అధికారం కూడా. అవసరమైన అనుమతులు లేకుండా విద్యుత్తు ఉత్పత్తి చేయడం నేరం. అయితే పట్టణాలలోని ఆఫీసులు, పరిశ్రమలు కాని, పౌరులు కాని ఉత్పత్తి చేయడానికి లైసెన్సులు మంజూరు చేయడం వారికి తగినంత ప్రోత్సాహకాలు అమలు చేయడం, వారి వినియోగం కంటే అధికంగా ఉత్పత్తి అయిన విద్యుత్తును కొనడం కూడా ప్రభుత్వాలు చేస్తున్నాయి. ఇవన్నీ పట్టణాలలో చేయడం సబబుగానే ఉంది. కానీ, ఈ వ్యక్తిగత విద్యుత్పత్తి వ్యవసాయ దారులపై నెట్టడం ఎంతవరకు సబబు? వారు ఎందుకు ఉత్పత్తి చేయాలి? ప్రభుత్వం చేతులు దులుపుకోవడం, రైతును తనకు కావలసిన విద్యుత్పత్తికై బాధ్యున్ని చేయడం ఎంతవరకు సమంజసం? దీనిపై చర్చ అత్యవసరం. తొందరపాటుతో అమలు చేసి, ఆ తర్వాత చేతులు కాలాక ఆకులు పట్టుకోవడంతో వచ్చే కష్టాలను, నష్టాలను ఇప్పుడు కూలంకషంగా చర్చించుకోవాలి. ఇంతకంటే మంచి ఉపాయాలు రైతుకు విద్యుత్తు సరఫరాలో ఉన్నాయేమో వెతకాలి. ఈ సందర్భంలో పల్లెసృజన అభిప్రాయాలు .....

వ్యవసాయం ఒక క్లిష్టమైన వృత్తి. పామరులు చేస్తే సులభం అని, సైంటిస్టులు చేస్తే క్లిష్టమైన పని అని మన విద్యాధికులు భావిస్తారు.  క్షిపణులు చేయడం సులభం కాని వ్యవసాయం అంతకంటే క్లిష్టం (అది నా స్వీయ అనుభవం). రైతు ప్రతిరోజు మారుతున్న పంచభూతాలను నెట్టుకు రావాలి.



ఆయన వీటిని నియంత్రించలేడు. నిత్యం మారుతున్న పరిస్థితులను అవగాహన చేసుకుంటూ దానికి తోడుగా రోజా తన కృషిలో సరియైన మార్పులు చేస్తూ పంటలు పండిస్తాడు. మార్పును నిర్వహిస్తూ పంటలు పండించేవాడు రైతు. ఆ పనుల్లో నిమగ్నమైన రైతును తనకు కావలసిన విద్యుత్తును తయారు చేసుకొమ్మని చెప్పడం భావ్యమా?. ఈ సాంకేతికతను అర్థం చేసుకొని వాటిని నిర్వహిస్తూ నీటి నిర్వహణ సమర్థవంతంగా కాపాడుతూ క్లిష్టమైన పంటలు పండించడం కూడా ఆయనపై రుద్దటం సరియైన పనేనా? ఆయనకు తెలియని పని, తెలియని సాంకేతికతను అప్పచెప్తే, ఇతరులమీద ఆధారపడతాడు. దాంతో ఆయన సామర్థ్యాలు తగ్గిపోతాయి. ఖర్చులు, నష్టాలు పెరుగుతాయి. ఆయన చేయలేకపోతే పంటలకు పెద్దయెత్తున నష్టం కలుగుతుంది.

అలా కాకుండా రైతు చేసే పనులను రైతుకే అప్పజెప్తే బాగుంటుంది కదా? ఉదాహరణకు విత్తనాల తయారీ రైతుకు అవగాహన ఉంది. అలాంటి కార్యక్రమాన్ని బాధ్యతను రైతుకు అప్పజెప్పి, తగిన జ్ఞానాన్ని వారికి అందజేస్తే ఎంతో బాగుంటుంది. రైతుల శక్తులను శక్తివంతం చేయాలి. అలా చేయకుంటే రైతుకు నష్టాలు తప్పవు. కానీ అలా చేస్తే కార్పోరేట్ కంపెనీలు నష్టపోతాయి కదా!.

మా ఉద్దేశ్యంలో రైతుకు విద్యుత్తు ఉత్పత్తి చేసే బాధ్యతను అప్పగించ కూడదు. అతనికి అలవాటైన విద్యుత్తును విధిగా రోజుకు 6-8 గంటలు ( ఉదయం - సాయంత్రం) సరఫరా చేసే బాధ్యత ప్రభుత్వాలే వహించాలి. రైతు స్విచ్ వేస్తే కరెంటు రావాలి. రైతు పూర్తి దృష్టి పంటలపైనే ఉంటే సమాజానికి శ్రేయస్సుగా ఉంటుంది.

మరి వారికి కావలసిన విద్యుత్తు ఎలా వస్తుంది? ఉద్గారాలతో తయారయ్యే విద్యుత్తు ఉత్పత్తిని రైతులు డిమాండ్లకై పెంచడం, వాతావరణ కాలుష్యానికి తోడు పడుతుంది కదా? కిం కర్తవ్యం?

విదేశాలలో ముఖ్యంగా ఆస్ట్రేలియాలో పట్టణాలలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటడు భవనాలకు విద్యుత్తు సరఫరా ప్రభుత్వం చేయదు. వారిని సోలార్ శక్తి ద్వారా విద్యుత్ ఉత్పత్తికై అనుమతులిస్తోంది. ప్రోత్సాహకాలు జత చేస్తుంది. ఒకరకంగా నిబంధనలు పెట్టి వారితో విద్యుత్ ఉత్పత్తి చేయిస్తుంది. ఇలా మన పట్టణాలలో సూర్యశక్తి ద్వారా విద్యుత్తు ఉత్పత్తి విస్తారంగా చేస్తే ఎంతో విద్యుత్తు మిగిలిపోతుంది. దీన్ని మనం గ్రామాలకు, రైతుకు, వ్యవసాయానికి సులభంగా ఇవ్వవచ్చు. ఉద్గారాలతో విద్యుత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉండదు. పట్టణాల్లో సోలార్ శక్తితో విద్యుత్తు ఉత్పత్తి చేయడం సులభం. దాన్ని సరిగ్గా కాపాడుకోవడం, బ్యాటరీలు లాంటి వ్యర్థాలను సరిగ్గా ఉపయోగించడం.... ఇలాంటివన్నీ వ్యవస్థలో భాగంగా, సాంకేతికత సహాయంతో జరగడం సులభం. అదే బ్యాటరీలు మార్చుకొని వాటిని బయట పారవేయడం గ్రామాల్లో సాధ్యం కాదు. ఒక గ్రామంలో 2 కిలో వాట్ల సోలార్ విద్యుత్‌లు వంద పెట్టారనుకుందాం. దాని ఖర్చు ఒక్కొక్కదానికి దాదాపు లక్షన్నర దాకా వస్తుంది. పది బ్యాటరీలు ప్రతి మూడు సంవత్సరాలకు మార్చాలంటే రైతుకు భారంగా ఉంటుంది. 300 బ్యాటరీలను ఊళ్లో ఎక్కడ పడేసినా, ఒక బ్యాటరీలో ఉండే కనీసం 5 లీటర్ల ఆమ్లాలు ( యాసిడ్‌లు) అంటే 1,500 లీటర్ల్లు ఊరి వాతావరణంలో, భూమిలో, నీటిలో చేరి గ్రామంలోని మనుష్యులకు, జంతుజాలానికి ప్రాణహాని కలిగిస్తాయి. పది సంవత్సరాల్లో 900 బ్యాటరీలు, 4,500 లీటర్ల ఆమ్లాలు గ్రామ ప్రజల జీవనంలో అపాయంతో పాటు కష్టతరం చేస్తాయి. ఈ సత్యాలన్నీ దాచిపెట్టి మనం రైతులకు సౌరశక్తితో విద్యుత్తు ఉత్పత్తి చేసే బాధ్యతను అప్పగిద్దామా? వద్దు.... వద్దు... రైతులకు నష్టాలు కలిగించే పని ఏమాత్రం చేయకూడదు. సమాజంలో ఎవరి పని వారే చేస్తే సమన్వయంతో అభివృద్ధి వస్తుంది. తమ బాధ్యతను మరొకరికి అప్పగిస్తే శాంతియుత జీవనం తగ్గిపోతుంది. ప్రభుత్వాలు ఈ ప్రధాన అంశాన్ని అధిక ప్రాధాన్యతతో గమనించాలి.

'పల్లెసృజన' అభిప్రాయాలపై మీరంతా చర్చ జరపాలి. మాతో మీ ఆలోచనలను పంచుకోండి. అందరం కలిసి రైతన్నలను కాపాడుకుందాం. వారిని శక్తివంతుల్ని చేద్దాం.

ఈ సంచికలో పట్టు పరిశ్రమకు ఊతమిచ్చే ఒక మంచి ఇన్నోవేషన్ గురించి వ్రాశాము. 'ప్రవీణ్ కుమార్', సిరిసిల్లా జిల్లా వాసి చేసిన ఈ పరికరం మల్బరీ రైతులకే కాకు,డా, కర్ణాటక  ప్రభుత్వాన్ని కూడా ప్రభావం చేసింది. పల్లె జ్ఞాన ప్రభావం సమాజంలో ఎంతో ఉందని ఇలాంటి కథల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

ఖరీఫ్ పంటలు వచ్చే రెండు నెలల్లో కొలిక్కివస్తాయి. రైతులకు అంతా శుభం, లాభం కలగాలని మనసారా ఆశిస్తూ.....

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

# పట్టు వ్యవసాయం చేసే రైతుల వెతలు తీర్చిన 'ప్రవీణ్ కుమార్'
# మల్బరీ చెట్లను కత్తిరించే 'ట్రాక్టర్ అనుసంధాన పరికరం'



\- వీరరాఘవ రెడ్డి

పట్టు పురుగుల పెంపకం చేస్తున్న రైతులు ఆ పట్టు పురుగులకు 'మల్బరీ' చెట్లను పొలంలో నాటి, వాటి ఆకులను పట్టు పురుగులకు ఆహారంగా ఇస్తారు. చిన్న వయసులో వున్న పురుగులు ఆకులు ఎక్కువగా ముదిరితే తినలేవు. కాబట్టి లేత ఆకులనే సేకరించి ఆ పురుగులకు ఆహారంగా అందిస్తారు. పురుగు వయసు పెరిగే కొద్దీ ముదిరిన ఆకులను కూడా ఆహారంగా వేస్తారు. పట్టు పురుగులు గూళ్ళు పెట్టి పంట అయిపోయిన తర్వాత ఆ గూళ్ళను సేకరించి, వాటిని మార్కెట్‌కు తరలించి, అమ్ముకుంటూ ఉంటారు. మళ్ళీ పురుగులను సేకరించి, పురుగుల పెంపకం చేపడుతూ ఉంటారు. ఈ తతంగంలో ఎక్కువ మంది రైతులు ప్రతి రెండు లేదా మూడు సంవత్సరాలకు ఒకసారి మల్బరీ చెట్లను పూర్తిగా కాకుండా భూమికి ఒకటి లేదా రెండు అడుగుల ఎత్తు వరకు మాత్రమే ఉంచి, మిగతా మొక్కలను నరికి వేస్తూ ఉంటారు. మళ్ళీ కొద్ది రోజుల్లోనే కొత్త చిగుళ్ళు వేసి లేత ఆకులతో పట్టు పురుగులకు ఆహారం అందించేందుకు తయారవుతుంది మొక్క. దీన్నే కొన్ని ప్రాంతాలలో 'దుంప కొట్టడం' అంటారు.

ఈ దుంప కొట్టే పనిని కొందరు రైతులు చేతితో కొడవలితో కత్తిరిస్తే, మరి కొందరు రైతులు 'బ్రష్ కట్టర్' అనే యంత్రం సహాయంతో కత్తిరిస్తూ ఉంటారు. ఈ మొక్కల కొమ్మలు చాలా గట్టిదనంతో కూడా ఉంటాయి కాబట్టి వీటిని చాలా బలం ఉపయోగించి కత్తిరించాల్సి ఉంటుంది. మనుషులు కొడవలితో కత్తిరించాలంటే ఒక ఎకరా మొక్కలను కత్తిరించడానికి 3-4 వ్యక్తులు ఒక రోజంతా కష్టపడాల్సి ఉంటుంది. అదే కత్తిరింపును బ్రష్ కట్టర్‌తో చేస్తే ఆ యంత్రాన్ని నడపగల నైపుణ్యం గల వ్యక్తి ఒక రోజుకు పైగా కష్టపడితే తప్ప ఒక ఎకరం పొలం పూర్తవదు. పైగా ఈ బ్రష్ కట్టర్ ఎక్కువ కుదుపులు (వైబ్రేషన్) కలగి ఉంటుంది కాబట్టి మనిషి త్వరగా అలసటకు గురవుతాడు. బ్రష్ కట్టర్‌తో గడ్డి లాంటి దాన్ని కత్తిరించేందుకు పెద్దగా అలసట ఉండదు కానీ, ఈ మల్బరీ మొక్కల కొమ్మలు చాలా బలంగా ఉంటాయి కాబట్టి వైబ్రేషన్ ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఈ పని చేసిన తర్వాత ఒకటి రెండు రోజుల పాటు మనిషి ఆ వైబ్రేషన్ వత్తిడి నుండి బయటకు రాలేడు. పైగా ఇలా బ్రష్ కట్టర్‌తో కత్తిరించేటపుడు ఒక పెద్ద కొమ్మ దానికి తగిలినా, లేదా భూమికి దాదాపు సమాంతరంగా కత్తిరిస్తూ ఉంటారు కాబట్టి ఒక్కోసారి రాయి లాంటిది తగిలినా ఆ బ్రష్ కట్టర్ బ్లేడు తెగిపోయి, పని చేస్తున్న వ్యక్తి కాళ్ళకు తగులుకుని ప్రమాదానికి గురయ్యే అవకాశం కూడా ఉంటుంది.

ఈ సమస్యలన్నిటికి సమాధానంగా ఒక ట్రాక్టర్ అనుసంధానిత పరికరాన్ని తయారు చేశాడు మన ఇన్నోవేటర్ "ప్రవీణ్ కుమార్". రాజన్న సిరిసిల్లా జిల్లా, తంగళ్లపల్లి మండలం, చిన్న లంగాపూర్ గ్రామానికి చెందిన శ్రీమతిసత్తవ్వ, శ్రీ సత్తయ్య ల పుత్రుడు "కొడిముంజ ప్రవీణ్ కుమార్". ఇతని తండ్రి వడ్రంగి పని చేస్తుండటం వల్ల ప్రవీణ్‌కు చిన్నప్పటి నుంచే వ్యవసాయ పనిముట్ల పైన ఎంతో గురి ఏర్పడింది. కానీ కాలక్రమంలో గ్రామాల్లో వడ్రంగి పని వారిని వదిలి రైతులు పట్టణాల్లో తమ వ్యవసాయ పనిముట్లను కొనుగోలు చేయటంతో గ్రామాల్లో వడ్రంగి వారికి పని కరువైంది. అందువల్ల వారు పట్టణాలకు వలస బాట పట్టారు. ఆ క్రమంలో

> రైతు ఆలోచనను, తన ఆలోచనతో క్రోడీకరించి మొత్తానికి ఇంతవరకు మార్కెట్‌లో లేని ట్రాక్టర్‌కు అనుసంధానం చేసే ఒక పరికరాన్ని తయారు చేశాడు. 'ఇది కదా "పల్లెసృజన" కోరుకుంటోంది. రైతు సమస్య ఏమిటో తెలియజేస్తే దానికి అవసరమైన పరికరాన్ని తక్కువ ఖర్చులో, ఎక్కువ శ్రమ తగ్గేలా పరిష్కారం చూపేందుకు 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు ఎప్పుడూ ముందుంటారు'.

ప్రవీణ్ వాళ్ల కుటుంబం కూడా సమీప రోడ్డు మార్గం పైన ఉన్న 'జిల్లెల్ల' గ్రామానికి వలస వచ్చి అక్కడ ఒక లేత్ మిషన్ ఏర్పాటు చేసుకుని, తాను చిన్నప్పటి నుంచి అనుభవమున్న వ్యవసాయ పనిముట్లను చేసుకుంటూ జీవనం సాగించటమే కాక, రైతుకు అవసరమైన, వారి సమస్యలను తీర్చగల ఎన్నో రకాల సృజనాత్మక పరికరాలను తయారు చెయ్యటంలో మంచి ప్రావీణ్యత సంపాదించాడు ప్రవీణ్. తండ్రి సహకారంతో వ్యవసాయ పనిముట్లు ఏ విధంగా ఉండాలో నేర్చుకుంటే ఇతను చేస్తున్న పనికి ప్రవీణ్ భార్య శ్రీమతి లహిత ప్రోత్సాహం కూడా ఎంతో ఉత్సాహంతో ముందుకు నడిచేలా చేసింది. ప్రవీణ్ గురించి 'పల్లెసృజన' పాఠకులకు పరిచయమే గతంలో (జనవరి–ఫిబ్రవరి, 2018 సంచిక) ఇతని గురించి ప్రచురించటం జరిగింది.

పట్టు పురుగు పెంపకం వ్యవసాయం చేస్తున్న రైతుల సమస్య ను సిద్దిపేట జిల్లాకు చెందిన 'ఐలయ్య' అనే ఒక రైతు ఇన్నోవేటర్ ప్రవీణ్ కుమార్‌కు తెలియజేసి, ఈ సమస్యకు ఏదైనా పరిష్కారంగా ఒక పరికరం తయారు చేసి ఇవ్వమని కోరటం జరిగింది. సవాళ్ళను ఎదుర్కోవటంలో మన ఇన్నోవేటర్లు ఎప్పుడూ ఉత్సాహంగా ముందుకు వెళ్తారు కాబట్టి ప్రవీణ్ కూడా ఈ సమస్యకు నేను పరిష్కారం ఇస్తాను అని, రైతు ఆలోచనను, తన ఆలోచనతో క్రోడీకరించి మొత్తానికి ఇంతవరకు మార్కెట్‌లో లేని ట్రాక్టర్‌కు అనుసంధానం చేసే ఒక పరికరాన్ని తయారు చేశాడు. ఇదే కదా "పల్లెసృజన" కోరుకుంటోంది. రైతు సమస్య ఏమిటో తెలియజేస్తే దానికి అవసరమైన పరికరాన్ని తక్కువ ఖర్చులో, ఎక్కువ శ్రమ తగ్గేలా పరిష్కారం చూపేందుకు 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు ఎప్పుడూ ముందుంటారు' అని చెప్తున్నది పల్లెసృజన.

మొదట ఈ పరికరానికి రెండు పదునైన పండ్ల చక్రాలను పక్క పక్కన ఏర్పాటు చేసి, ట్రాక్టరులో ఏర్పాటు చేయబడి వున్న 'షాఫ్ట్' ఆధారంగా ఇవి పని చేసేట్టుగా వాటితో మల్బరీ చెట్లను కత్తిరించేలా పరికరాన్ని తయారు చేసి ఇచ్చాడు. ఆ పరికరాన్ని వాడిన రైతు ప్రవీణ్‌తో తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. ఎంతో శ్రమను, సమయాన్ని తగ్గించేలా పరికరం తయారు చేసి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేశాడు. ఒక రోజంతా కష్టపడి బ్రష్ కట్టర్‌తో పని చేస్తే కాని ఒక ఎకరం పొలంలోని మల్బరీ మొక్కల కత్తిరింపు సాధ్యం కాదని, ఈ పరికరం వల్ల కేవలం ఒక





గంటలో ఎటువంటి అలుపు లేకుండా ఒక ఎకరం పొలంలో కత్తిరింపు అయిపోతుంది. ఇటువంటి పరికరం తయారు చేసి ఇచ్చినందుకు ధన్యవాదములు అంటూ ఆ రైతు తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు ప్రవీణ్ కుమార్‌తో.

కానీ, పొలంలో ప్రత్యక్షంగా కత్తిరింపు పనిని చూసిన ఇన్నోవేటర్ ప్రవీణ్ మాత్రం తాను పూర్తిగా సంతృప్తి చెందలేదు. ఎందుకంటే ఆ యంత్రం కొన్ని సన్నటి మల్బరీ మొక్కల కొమ్మలను వదిలి వేస్తుంది. వాటిని కూడా కత్తిరిస్తే పొలం పూర్తిగా కత్తిరించినట్లు అవుతుంది కదా అనుకుని తన అభిప్రాయాన్ని ఆ రైతుకు తెలియజేశాడు. అటువంటి చిన్న చిన్న పుల్లలను మేము చేతితో కత్తిరిస్తాంలే, అతి ముఖ్యమైన పెద్ద పనిని చాలా సులభతరం చేశావు, ఇది చాలు. మాకైతే ఎంతో తృప్తిగా ఉంది అంటూ ఆ యంత్రంతో ఆ రైతు తన తోటి రైతుల పొలాల్లో కూడా కత్తిరింపులు చేస్తున్నాడు.



కానీ, మన ఇన్నోవేటర్లకు ఉన్న సహజ లక్షణం 'తాను చేసిన పరికరం తనకు సంతృప్తిగా ఉండాలి' అన్నది. ఈ లక్షణం వల్ల ఈ యంత్రానికి మరికొంత అభివృద్ధి చేస్తే ఆ సన్నటి కొమ్మలను కూడా కత్తిరిస్తుంది కదా అనుకుంటున్న సమయంలో 'రాజు' అనే మరో రైతు తనకూ అటువంటి పరికరం ఒకటి తయారు చేసి ఇవ్వమని అడిగాడు. ప్రవీణ్ సంతోషంతో తాను అనుకున్న అభివృద్ధిని ఈ యంత్రానికి ఏర్పాటు చేసి, పరికరాన్ని తయారు చేశాడు. గతంలో రెండు పండ్ల చక్రాల ఏర్పాటుతో పాటు మరో చిన్న పండ్ల చక్రాన్ని ఈ రెండు చక్రాలకు మధ్యలో వెనక వైపున ఏర్పాటు చేశాడు. మొదట ఏర్పాటు చేసిన రెండు చక్రాల మధ్య అరంగుళం దూరం ఉండేది. రైతు కోరిక మేరకు ఈ దూరాన్ని ఏర్పాటు చేశాడు. రైతు ఆ మాట ఎందుకన్నాడు అంటే అర అంగుళం కన్నా ఎక్కువగా చెట్టు కొమ్మలు ఉంటాయి, వాటిని చేతితో లేదా బ్రష్ కట్టర్‌తో కత్తిరించడం చాలా కష్టం అన్నాడు. కానీ, అంతకన్నా సన్నగా వున్న కొన్ని కొమ్మలు కత్తిరించ బడకుండా అలాగే ఉండిపోయేవి. ఆ సమస్యను తీర్చటం కోసం మూడో చక్రాన్ని రెండింటికి మధ్యలో, వెనక వైపున అమర్చటం వల్ల ఏ చిన్న కొమ్మ కూడా తప్పించు కోవటానికి వీలు లేకుండా అన్నీ కత్తిరించ బడతాయి. ఈ పరికరాన్ని ట్రాక్టరుకు అనుసంధానం చేసి పొలంలో క్షేత్రస్థాయి పరీక్షలు జరుపగా, ఏ చిన్న కొమ్మను కూడా వదలకుండా మొత్తం మొక్కలను కత్తిరించటం తో తాను ఎంతో తృప్తిని పొందాడు ప్రవీణ్. ఆ పరికరాన్ని తయారు చేయించిన రైతు కూడా తనకు ఇంకా అభివృద్ధి చేసిన పరికరం ఇచ్చి నందుకు ఎంతో సంతృప్తిని వ్యక్తం చేశాడు.

ఈ మల్బరీ మొక్కలను రైతు భూమి నుండి ఎంత ఎత్తులో కత్తిరించుకోవాలో అంతే ఎత్తులో కత్తిరిస్తుంది. కొందరు రైతులు అర అడుగు ఎత్తు ఉంటే చాలు అనుకుంటారు కొందరు ఒకటి లేదా ఒకటిన్నర అడుగుల ఎత్తు ఉంటే మంచిది అనుకుంటారు. ఎవరు ఎలా కావాలంటే అలా కత్తిరించుకోవటానికి ఆ పరికరాన్ని అవసరమైన మేర ఎత్తును మార్చుకునే సదుపాయం కల్పించాడు ప్రవీణ్.

ఈ యంత్రం వీడియోను ఎంతో అనుభవం వున్న కొందరు మల్బరీ రైతులకు చూపించగా, వారు ఇది చాలా బాగుందని, నిజంగా ఇటువంటి యంత్రం కొరకే మేము ఎదురు చూస్తున్నాము. ప్రస్తుతమున్న కూలీల లేమి పరిస్థితుల్లో మల్బరీ మొక్కలను దుంపకోత చేయాలంటే సాధ్యం కాక, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి చేసే వాళ్ళము ఇప్పుడు 3-4 సంవత్సరాల పాటు అలాగే ఉంచుకోవాల్సి వస్తోంది. అందువల్ల కొత్తగా పురుగులు తెచ్చి పెంపకం ప్రారంభించినపుడు ఆ పురుగులకు లేత ఆకులను సేకరించాలంటే కూలీలకు చాలా సమయం పడుతుంది. అదే దుంప కత్తిరిస్తే అప్పుడు లేత ఆకులు ఎక్కువగా ఉంటాయి కాబట్టి వాటిని సేకరించే పని సులువుగా ఉంటుంది అని అన్నారు. మొత్తానికి మల్బరీ రైతులకు ఎంతో ఉపయోగ కరమైన ఇటువంటి పరికరం తయారు చేసినందుకు ప్రవీణ్‌కు తమ అభినంద నలు తెలియజేశారు.

### మొదటి పరికరం ఉపయోగించిన రైతు ఐలయ్య అభిప్రాయం:



నా పేరు 'పెద్దోళ్ళ ఐలయ్య', మాది సిద్ధిపేట జిల్లా, చిన్న కోడూరు మండలం, చందిలాపూర్ గ్రామం (ఫోన్ 99592 78716) నేను ఎన్నో సంవత్సరాలుగా పట్టు



పురుగుల వ్యవసాయం చేస్తున్నాను. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పట్టు పురుగు లకు అవసరమైన మేత కొరకు వేసే మల్బరీ చెట్లను కత్తిరించాలంటే ఎంతో వ్యయం, శ్రమ పడాల్సి వచ్చేది. అనుకున్న సమయానికి కూలీలు లభించక, లభించినా ఎక్కువ కూలీల ఖర్చు కావటం లాంటి సమస్యలతో బాధ పడుతున్న సమయంలో 'బ్రష్ కట్టర్' వచ్చింది. దానితో మల్బరీ మొక్కలను కత్తిరించే పని కొంత వరకు సులభతరం అయింది. కానీ, ఆ కత్తిరించే వ్యక్తి సరియైన నిపుణుడు అయితేనే బావుంటుంది. అయినా అతను రోజంతా కష్టపడి పని చేయటం వల్ల ఆ యంత్రం వైబ్రేషన్ (కుదుపులు)తో చాలా శ్రమకు గురై సాయంత్రానికి ఎంతో అలిసి పోయేవాడు.

ప్రవీణ్‌ను కలిసి ఈ ట్రాక్టర్‌కు అనుసందానం చేసుకుని ఎటువంటి అదనపు (ఇంధనం లాంటి) ఖర్చు లేకుండా కేవలం ట్రాక్టరు లో వున్న షాఫ్ట్ ఆధారంగా పని చేసే యంత్రం తయారు చేసి మాకెంతో ఊరటనిచ్చాడు ప్రవీణ్. ఈ యంత్రం కారణంగా మాకు ఖర్చు, సమయం కలిసి రావటమే కాకుండా అదనంగా ఒక పట్టు గూళ్ళ పంటను తీయటం వల్ల అదనపు ఆదాయం కూడా లభిస్తోంది. నేను సంవత్సరానికి 4 పంటలు తీసేవాన్ని, ఇప్పుడు 5 పంటలు తీస్తున్నాను. ఈ విధంగా మాకు పరికరం తయారు చేసి సహకరించిన ప్రవీణ్ కుమార్‌కు మేమెంతో కృతజ్ఞులం.

### పరికరం ఉపయోగిస్తున్న మరో రైతు 'భూపతి రాజు' అభిప్రాయం:



నా పేరు 'భూపతి రాజు', మాది రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మండలం, చింతలతాన గ్రామం. (ఫోన్ : 99127 77078). నేను చాలా సంవత్సరాలుగా పట్టు పురుగుల పెంపకం చేపట్టి వ్యవసాయం చేస్తున్నాను. కొద్ది రోజుల క్రితమే మా జిల్లాలోని ప్రవీణ్ అనే ఇన్నోవేటర్ మల్బరీ చెట్లను కత్తిరించేం దుకు ఒక ట్రాక్టర్ షాఫ్ట్‌తో పని చేసే పరికరం తయారు చేశాడని తెలుసుకు న్నాను. ఎటువంటి అదనపు యంత్రం, ఇంధనం మళ్ళీ దాన్ని నడిపేందుకు ఒక మనిషి లాంటి అవసరాలు లేకుండా కేవలం ట్రాక్టర్ డ్రైవర్ ఒక్కడే మల్బరీ చెట్లను కత్తిరించేలా ఉన్న ఈ యంత్రం చాలా బావుందని నేను కూడా తయారు చేయించాను. మొదట్లో ఈ మల్బరీ చెట్లు ఒక ఎకరం కత్తిరిం చాలంటే 7-8 మంది కూలీలు పట్టేవారు. ఆ

తర్వాత బ్రష్ కట్టర్‌తో ఒక మనిషి ఒక రోజంతా కష్ట పడితే ఒక ఎకరం చెట్లను కత్తిరించేవాడు. కానీ ఆ మనిషి సాయంత్రానికి ఎంతో అలసటకు గురయ్యేవాడు. అందుకు కారణం ఆ బ్రష్ కట్టర్ యొక్క వైబ్రేషన్‌లు మనిషి చాలా కుంగదీసేవి. ఈ సమస్యలన్నీ పోయి ఇప్పుడు కేవలం ఒక గంటలో ఒక ఎకరం పొలాన్ని ఎటువంటి అలుపు లేకుండా ట్రాక్టర్ డ్రైవరే కత్తిరించే వేస్తున్నాడు.

నేను సంవత్సరానికి 6-7 పంటలు తీసేవాడిని ఇప్పుడు కత్తిరింపు సమయం చాలా తక్కువ కావటం వల్ల మరో పంటను అధికంగా తీస్తున్నాను కాబట్టి నాకు శ్రమ, ఖర్చు తగ్గటంతో పాటు, ఆదాయం కూడా పెంచేలా పరికరం తయారు చేసిన ప్రవీణ్ గారికి కృతజ్ఞతలు.

మల్బరీ చెట్లను కత్తిరించిన తర్వాత ఆ కొమ్మలను పొలం బయట వేసి అవి ఎండిన తర్వాత కాల్చివేసే వాళ్ళం లేదా కొందరు మహిళలు వాటిని పొయ్యిలో వాడుకోవటానికి తీసుకు వెళ్ళేవారు. కానీ, వీటిని చిన్న చిన్న ముక్కలుగా చేసి పేడ దిబ్బలో వేసినట్లయితే అవి మురిగి మంచి కంపోస్టు ఎరువుగా తయారు అవుతుంది అని, ఈ కొమ్మలను చిన్న చిన్న ముక్కలుగా చేసేందుకు కూడా ఒక యంత్రం తయారు చేసి ఇవ్వమని ప్రవీణ్‌కు చెబుతున్నాను. ఈ విధంగా మాకు అదనంగా మంచి కంపోస్టు ఎరువు కూడా వచ్చి ఇంకా అదనంగా ఆదాయం సమకూరుస్తున్నాడు ఇన్నోవేటర్ ప్రవీణ్.

**ప్రవీణ్‌కు ఇన్నోవేటర్ గురుమూర్తి కితాబు :**

'పల్లెసృజన' పాఠకులకు పట్టుపురుగుల వ్యవసాయంలో ఎన్నో ఇన్నోవేషన్‌లు చేసి, చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతంలో ఎంతో పేరెన్నిక గన్న 'గురుమూర్తి శెట్టి' గుర్తుండే ఉంటుంది. అతను ఎన్నో సంవత్సరాలుగా పట్టుపురుగుల వ్యవసాయం చేస్తూ, అందులో వున్న సాధక బాధకాలను గుర్తించిన సృజనాత్మక రైతు. ఇప్పటికే పట్టు పురుగుల సస్యరక్షణ, అవి పెట్టి పట్టు గూళ్ళను సులభంగా సేకరించ టంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ నాణ్యత గల పట్టు గూళ్ళను సేకరించటం లాంటి ఎన్నో రకాల ఇన్నోవేషన్‌లను పట్టు పరిశ్రమ రైతులకు అందించాడు. ప్రవీణ్ ఈ 'దుంప కత్తిరింపు' కొరకు తయారు చేసిన పరికరాన్ని గురించి వివరించి, అతనికి వీడియో చూపించగా గురుమూర్తి ఆశ్చర్య పోతూ ఒక సంఘటనను గురించి 'పల్లెసృజన'తో పంచుకున్నాడు.

గురుమూర్తి తాను ఇటీవల కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం వారి ఆహ్వానం మేరకు బెంగుళూరులో జరిగిన పట్టు పురుగుల వ్యవసాయం చేసే రైతుల కొరకు ఇటీవల బెంగుళూరులో ఒక వ్యవసాయ ప్రదర్శన కు వెళ్ళటం జరిగింది. ఆ ప్రదర్శన అనంతరం దాదాపు రైతులు అందరు వ్యవసాయ అధికారులతో విన్నవించిన తమ ప్రధాన సమస్యల్లో ఈ 'దుంప కత్తిరింపు' సమస్య చాలా తీవ్రమైనదిగా భావించాలని, దీనికి





వీలైనంత త్వరలో ఒక యంత్రం లేదా పరికరం తయారు చేయించమని అభ్యర్థించారు. ఈ దుంప కత్తిరింపు కొరకు కూలీలు లభించక, రెండు సంవత్సరాలకు ఒకసారి చేయాల్సిన పనిని 3-4 సంవత్సరాలకు ఒక సారి చేసుకుంటున్నామని, ఇందులో కూడా ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని అని దీనికి పరిష్కారం చూపమని కోరుకున్నారట. దానికి వ్యవసాయ అధికారులు రైతులను వేధిస్తున్న తీవ్రమైన సమస్యను తెలుసుకుని, మీ సమస్యకు పరిష్కారం కొరకు ఒక్క ఆరు నెలలు మాకు సమయం ఇవ్వండి, వీలైనంత త్వరలో మీ సమస్యను పరిష్కరించే యంత్రాన్ని అందించే ఏర్పాటు చేస్తామని అన్నారట.

కానీ, ఆ వ్యవసాయ ప్రదర్శనకు వెళ్ళి వచ్చిన అతి కొద్ది రోజుల్లోనే అదీ మన 'పల్లెసృజన' ఇన్నోవేటర్ "ప్రవీణ్ కుమార్" ఈ సమస్యను ఇంత సులభంగా తీర్చే ట్రాక్టర్ అనుసంధానిత పరికరం తయారు చేయటం తనకు ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా కలిగింది అని తన సంతోషాన్ని 'పల్లెసృజన'తో పంచుకున్నాడు. ఈ ఇన్నోవేషన్‌ను కర్ణాటక ప్రభుత్వానికి సంధానం చేస్తున్నాడు.

ఇన్నోవేటర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ "ఈ పరికరం కేవలం మల్బరీ మొక్కలను కత్తిరించేటందుకే కాక, ప్రత్తి, మొక్క జొన్న లాంటి పంటలకు కూడా ఉపయోగ పడేలా దీన్ని ఇంకా అభివృద్ధి చేసి, రైతు లోకానికి అందిస్తాను. ప్రస్తుతం ఈ యంత్రం తయారు చెయ్యటానికి రూ. 60 వేల వరకు ఖర్చు అవుతోందని, వీలైనంత త్వరలో దీని తయారు ఖర్చును తగ్గించేందుకు కూడా ఆలోచిస్తున్నాను" అని ఆనందంగా తెలియజేశాడు. ఎక్కువ శ్రమతో పాటు రోజుల తరబడి జరిగే ఈ పనిని కేవలం గంటల వ్యవధిలో తీర్చే ఇన్నోవేషన్ కనుగొన్న ప్రవీణ్‌కు నా హృదయపూర్వక అభినందనలు. ఈ పరికరం మన 'పల్లెసృజన' ద్వారా దేశానికి అందుతున్నందుకు నాకు ఎంతో ఆనందంగా ఉంది అన్నారు.

మారుతున్న కాల పరిస్థితుల్లో కూలీల కొరత విపరీతంగా ఉంది. పైగా పూర్వం లాగా కూలీలలో ఎక్కువ కష్ట పడే స్వభావం తగ్గుతున్న పరిస్థితులు, ఖర్చు కూడా పెరిగిపోతున్నందున రైతులు ఇటువంటి చిన్న పరికరాలను కొనుగోలు చేసుకుని పట్టు పరిశ్రమ రైతులు శ్రమ, ఖర్చులు తగ్గించుకోవటంతో పాటు, అదనపు పంటను పండించటం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'. రైతుకు ఇన్ని విధాలుగా లాభం చేకూర్చే ఇన్నోవేషన్ తయారు చేసిన మా ఇన్నోవేటర్ 'ప్రవీణ్ కుమార్'కు అభినందనలు. ఈ పరికరం దేశ వ్యాప్తంగా విస్తరించేందుకు, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటోంది 'పల్లెసృజన'.

**ఇన్నోవేటర్ : కొడిముంజ ప్రవీణ్, ఫోన్ : 99592 78716.**

# 'టెడెక్స్' లో పల్లెసృజన వాణి
## వినిపించిన వ్యవస్థాపక అధ్యక్షులు 'బ్రిగేడియర్ గణేశం'




- వీరరాఘవ రెడ్డి

17 సెప్టెంబర్, 2023 ఆదివారం రోజు హైదరాబాద్ లోని 'ప్రధాన్ కన్వెన్షల్ హాల్'లో 'టెడెక్స్–2023' సదస్సు నిర్వహించ బడింది. ఈ సదస్సులో 'పల్లెసృజన' తరుపున 9 మంది ఇన్నోవేటర్లు, 8 మంది స్వచ్ఛంద కార్యకర్తలు (వాలంటీర్లు) పాల్గొని సదస్సుకు హాజరైన ప్రముఖులకు 25 ఇన్నోవేషన్లను ప్రదర్శించడం జరిగింది. ఈ ప్రదర్శన ఎంతోమంది ప్రముఖులను పునాది స్థాయి ఇన్నోవేషన్ల పైన అవగాహన కలిగింప జేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో 'పల్లె సృజన' తరుపున వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ పోగుల గణేశం గారు మన సంస్థ పునాది స్థాయి ఇన్నోవేషన్లను వెలుగులోకి తీయటం, అవి సమాజానికి ఏ విధంగా ఉపయోగకరంగా ఉంటున్నాయో వివరిస్తూ అద్భుతమైన ప్రసంగం చేయటం జరిగింది. సభకు హాజరైన అనేక మందిని గణేశం గారి సందేశం ఎంతో ఆలోచింప జేసింది, సంతోషంతో తమకు తెలియని, తమ చుట్టూ వున్న ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసినట్లయింది.

అలాగే ఇన్నోవేటర్లు ప్రదర్శించిన ఇన్నోవేషన్లను చూపరులను బాగా ఆకర్షింప జేయడమే కాక అనేక మంది అక్కడ ఉన్న ఇన్నోవేటర్లతో మాట్లాడి ఇన్నోవేషన్లను గురించి అడిగి తెలుసుకోవటం జరిగింది. పల్లెసృజన ఇన్నోవేటర్లు టెడెక్స్ సదస్సులో పాల్గొనడం ఇది మూడవ సారి. ఈ సదస్సు ద్వారా ఇంత వరకు మన ఇన్నోవేటర్లు ప్రపంచానికి పరిచయం అయ్యారు. కానీ ఈ సదస్సు ద్వారా 'పల్లెసృజన' చేస్తున్న కార్యక్రమాలు, ఈ కార్యక్రమాలన్నీ కేవలం స్వచ్ఛంద కార్యకర్తల సహాయ సహకారాలతోనే నిర్వహించ బడుతున్నాయి అన్న విషయం, స్వచ్ఛంద సంస్థకు అసలైన నిర్వచనం ప్రపంచానికి తెలియజేయ బడింది.

"ఈ సదస్సులో గణేశం గారు మాట్లాడుతుంటే వింటున్న వారిలో చాలామంది ఎంతో శ్రద్ధతో విన్నారు. వాళ్ళకు గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్ల గురించి కొత్తగా విన్నట్లుగా, ఇది చాలా ఉపయోగకరంగా ఉన్నట్లుగా అనుభూతి పొందారు. ఒక వాలంటీరుగా నేను ప్రేక్షకుల మధ్యలో ఉండి వింటుంటే, మనం పల్లెసృజన ద్వారా ఇంత పని చేశామా? అని నాకే ఆశ్చర్యం వేసింది. గణేశం గారు ఇన్నోవేషన్లను గురించి చెపుతూ ఏ పనీ నేను చేశాను అనకుండా అంతా 'పల్లెసృజన' కుటుంబం చేసింది అని చెపుతుంటే నాకెంతో ఆనందం వేసింది. ఆయన ప్రసంగంలో వారి మొదటి ఇన్నింగ్స్ మిలటరీ జీవితం గురించి చెప్పారు. సెకండ్ ఇన్నింగ్స్‌గా పల్లెసృజన, వాలంటీర్లు, ఇన్నోవేటర్లు, శ్రేయోభిలాషుల గురించి చెప్పారు. వారు మాట్లాడుతుంటే వాలంటీర్లు, ఇన్నోవేటర్లు అందరూ తాము మాట్లాడుతున్నట్లుగా అనిపించింది" అంటూ తన అనుభవాన్ని తెలియజేసింది వాలంటీర్ 'అఖిల'.









# వరిలో అద్భుతాలు సృష్టించిన చైన్ వీడర్

## సృజనాత్మక రైతు ముళ్ళపూడి సత్యనారాయణ అనుభవం



- వీరరాఘవ రెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన 'ముళ్ళపూడి సత్యనారాయణ' ఒక సృజనాత్మక రైతు. ఇతను గతంలో అంతర సేద్యాల కోసం చేతితో నడిపే వీడర్లు, పొలంలో గట్ల వెంట లోతుగా దున్నటానికి రెండు మూడు సార్లు దున్నాల్సిన అవసరం లేకుండా ట్రాక్టరుకు అనుసంధానం చేసిన గొర్రు లేదా నాగలి ఒక వైపుకు ఎక్కువగా దున్నేలా ఏర్పాటు చేసిన విషయం 'పల్లెసృజన' పాఠులకు గుర్తుండే ఉంటుంది. వీరి వ్యవసాయంలో ప్రధాన పంట 'వరి'. ఇప్పటి వరకు రసానిక వ్యయవసాయమే చేసేవాడు. గత రెండు సంవత్సరల నుండి సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లటం జరిగింది. ముఖ్యంగా సివిఆర్ పద్ధతిలో మట్టి వ్యవసాయం చేస్తున్నాడు.

గతంలో వరి పిలకలు (దుబ్బులు) ఎక్కువగా రావటానికి ఎన్నో రకాల రసాయన మందులు వాడేవారు. కానీ, సేంద్రియ వ్యవసాయంలో రసాయన మందులు వాడకూడదు కాబట్టి వరి పిలకల కోసం ఏం చేద్దామా అనుకుంటూ ఉండగా, గతంలో మన 'పల్లెసృజన' పత్రికలో ప్రచురించిన, యూట్యూబ్ ఛానల్ ద్వారా వెలుగులోకి వచ్చిన 'చైన్ వీడర్' గుర్తుకు వచ్చింది. ఈ చైన్ వీడర్‌ను మహబూబ్ నగర్‌కు చెందిన ఒక ఇన్నోవేటర్ తయారు చెయ్యగా, ఆ జిల్లా వ్యవసాయ అధికారులు దీనిని పరీక్షించి, దీన్ని ఉపయోగించటం వల్ల వరిలో ఎన్నో లాభాలు చేకూరుతాయని, దిగుబడి కూడా ఎక్కువగా వస్తుందని నిర్ధారించడం జరిగింది. సత్యనారాయణ ఈ పద్ధతిని ఉపయోగించి చూద్దామని దాదాపు 3 వేల రూపాయలు ఖర్చు చేసి, చైన్ వీడర్‌ను తయారు చేయించుకొని, తన పొలంలో వరి నాటిన 15 రోజుల తర్వాత పొలం మొత్తం చైన్ వీడర్‌తో లాగించాడు.



ఆశ్చర్యంగా కేవలం 12 రోజుల తర్వాత చూస్తే పొలంలో తానెన్నడూ చూడని రీతిలో, ఎన్ని రకాల మందులు పిచికారి చేసినా రాని పిలకలు తన వరి పంటలో రావటం చూసి ఆశ్చర్యానికి గురయ్యాడు. ఈ విషయం 'పల్లెసృజన'తో పంచుకుని, అందరు రైతులకు అందేలా చెయ్యాలన్న ఉత్సుకతతో వెంటనే తన పొలంలో పనిచేసిన వీడియోలు, ఫొటోలను పంచుకున్నాడు.

ఈ చైన్ వీడర్‌ను వరి మాగాణి పొలంలో లాగటం వల్ల వరిలో పిలకలు ఎక్కువగా రావటంతో పాటు, కలుపు కూడా 75 శాతం వరకు నివారించ బడుతుందని, కేవలం 25 శాతం కలుపును మాత్రమే మనం తీయించుకోవాల్సి ఉంటుందని అన్నాడు. ఈ చైన్ వీడర్ తయారీకి అయిన ఖర్చు కేవలం ఒక్క సంవత్సరంలో తీరిపోవటమే కాదు, ఊరికి ఒక్కటి ఉన్నా, ఊరందరి రైతుల వరి పంట ఎక్కువ దిగుబడి రావటంతో పాటు, కలుపు కూలీలు కూడా తగ్గి రైతులకు వేలాది రూపాల ఖర్చు తగ్గిపోవటం, అధిక దిగుబడ రావటం జరుగుతుందని, ఈ అవకాశాన్ని మాగాణి వరి వేసే రైతులంతా వినియోగించుకోవాలని 'పల్లెసృజన' తరుపున యావత్ రైతాంగానికి తెలియజేస్తున్నాడు 'ముళ్ళపూడి సత్యనారాయణ'.

ఈ చిన్న చిట్కాను రైతాంగం వినియోగించుకొని అధిక లాభాలు ఆర్జించటంతో పాటు, పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలని తెలియజేస్తోంది 'పల్లెసృజన'. ●

**రైతు ముళ్ళపూడి సత్యనారాయణ, ఫోన్ : 90002 50692**



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## పోక చెక్క చెట్లను సులభంగా ఎక్కే పరికరం

**ప్రోత్సాహక బహుమతి**



ఇన్నోవేటర్ : **గోబిన్ సిన్హా**, ఉన్నకోటి, త్రిపుర

పోకచెక్క చెట్లను ఎక్కడానికి చాలా పరికరాలు ఉన్నా, సిన్హా చేసిన పరికరం సురక్షతమైనది/ దృఢమైనది/ చవకైనది.

19 సంవత్సరల ఇంటర్మీడియట్ చదువుతున్న గోబిన్ సిన్హా త్రిపుర రాష్ట్రం లోని ఉన్నకోటిలో నివసిస్తూ ఉంటాడు. ఇతని తండ్రి ట్రక్కులు, ఇతర వాహనాలు నడపటం జీవనాధారంగా చేసుకున్నాడు వీరికున్న కొద్దిపాటి పొలంలో వరి పండిస్తూ ఉంటారు. వీరు నివసించే ప్రాంతంలో పోక చెట్లు ఎక్కువగా ఉండటం, వాటిని ఎక్కడానికి రైతులు నారతో చేసిన తాళ్ళు కట్టుకొని చెట్టును ఎక్కటం, తరచూ ఆ నార తాళ్ళు తెగిపోయి, చిన్న/ పెద్ద ప్రమాదాలు జరగటం, తరచూ ఆస్పత్రిపాలు కావటం, కొండొకసారి వికలాంగులు కావటం గమనించాడు సిన్హా.

ఈ పోక చెట్లను సులభంగా, సురక్షితంగా ఎక్కటానికి ఏదైనా మార్గం ఉందా అని తీవ్రంగా ఆలోచించిన సిన్హాకు ఒక చక్కటి పరిష్కారం దొరికింది. ఈ చెట్లు ఎక్కటానికి సులువైన పరికరం ఎవరి సలహా, సహకారం లేకుండా తానే రూపొందించాడు.

ఏ ఇంధనమూ, మోటారు అవసరం లేకుండానే ఎవరైనా వ్యక్తి తన చేతులు, కాళ్ళ సహాయంతోనే సులభంగా పోక చెట్లను ఎక్కవచ్చు.



ఇతరులు చూపించినట్లు రెండు వైపులా విస్తరించి వున్న రెండు అర్ధ చంద్రాకార ఎం.ఎస్. పట్టీలను తయారు చేసుకున్నాడు. చెట్టు బోదె మందానికి అనువుగా అమరేందుకు వీలుగా మధ్యలో ఒక స్ప్రింగును ఏర్పాటు చేసి, రండు బోల్టు నట్లతో ఈ అర్థ చంద్రాకార చట్రాలను బిగించాడు. దీనివలన చెట్టు మందానికి తగినట్లు మన పరికరాన్ని మార్చుకోవచ్చు. ఈ చట్రానికి రెండు వైపులా కాళ్ళు ఆనించేందుకు వీలుగా రెండు పట్టీలని, వాటిని కాలికి బిగించేందుకు అనువుగా చిన్న బల్టులను ఏర్పాటు చేశాడు.

చెట్టు ఎక్కాల్సి వచ్చినపుడు స్ప్రింగు వున్న బోల్టులను విప్పేసి, చెట్టు రెండు వైపులా ఈ అర్ధ చంద్రాకారపు పట్టీలను వేసి బోల్టులను బిగించాలి. చెట్టు ఎక్కే వ్యక్తి పక్కన అమర్చిన బెల్టులు ఉన్న పట్టీ పైన రెండు కాళ్ళను ఉంచి, చేతి పట్టు సహాయంతో చెట్టుపైకి ఎగబాకాలి. ఏ దశలోనైనా సరే క్రింద వున్న చట్రము జారిపోకుండా, కాలికి ఊతగా నిలుస్తుంది. ఈ విధంగా పోక చెట్ల పైకి సురక్షితంగా, త్వరగా ఎక్కి దిగటానికి సదుపాయంగా ఉంటుందీ పరికరం.

తేలికగా, చవకగా ఈ పరికరం సహాయంతో ఆ చుట్టు ప్రక్కల గ్రామాల్లోని ఎంతోమంది సురక్షితంగా ఈ పరికరం వాడి పోక చెక్కలను తెంపుకుంటున్నారు. ఈ పరికరం వాడిన అందరు రైతులు కూడా మునుపటికన్నా ధైర్యంగా చెట్లను ఎక్క గలుగుతున్నామని చెప్పటమే కాక, సురక్షితంగా ఉండటం వలన ధైర్యంగా ఎక్క గలుగుతున్నామని



అంటున్నారు.

పోక చెట్లను సాగు చేసే రైతులకు సురక్షితమైన ఈ పరికరాన్ని అందించిన గోబిన్ సిన్హాకు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ 2023లో తమ 11వ జాతీయ ద్వైవార్షిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో ప్రోత్సాహక బహుమతి ఇచ్చి సత్కరించారు.

## వెదురుతో బుట్టలు అల్లే యంత్రం

**విద్యార్థి విభాగంలో మూడవ బహుమతి**

ఇన్నోవేటర్ : **సుమిత్ మురారి,** బొకారో, ఝార్ఖండ్.



ప్రపంచంలోని చాలా దేశాలలో వెదురుతో చేసిన అనేే వస్తువులు చాలా ప్రాచుర్యం పొంది ఉన్నాయి. వెదురుతో పళ్ళు కుట్టుకునే పుల్లల నుండి పెద్ద భవంతుల వరకు అనేక వస్తువులు తయారు చేసుకోవచ్చు. వీటితో కుర్చీలు, బల్లలు, సల్పులు, బుట్టలు, తొట్టెలు, తడకలు, పడకలు..... ఇలా మానవాళికి నిత్య జీవితంలో అవసరమయ్యే ఎన్నో రకాల వస్తువులు తయారవుతున్నాయి. వెదురుతో చేపలు పట్టే వలల వద్ద నుండి అగరు బత్తీల కడ్డీల వరకు న్నో రూపాలలో వాడుకో వచ్చు. ఒకవిధంగా చెప్పాలి అంటే వెదురుతో తయారు చేయలేని వస్తువు అంటూ లేదని చెప్పవచ్చు. ఇల్లు కట్టడానికి, ఇటుకలు మోసే తట్టల దగ్గర నుండి పొలాలలో, మార్కెట్ లలో కూర గాయలు, పళ్ళు మోసే బుట్టల దాకా ఇళ్ళలో అందంగా అద్దాల బీరువాలు అలంకరించుకునే నాజూకైన బొమ్మలు, భరిణలు కూడా వెదురుతో చేసుకోవచ్చు.

వెదురు విస్తృతంగా లభించటమే కాక, చాలా మన్నికైనది కూడా. కాకపోతే దీనిని వివిధ రూపాలుగా మలచటానికి చాలా కృషి చేయవలసి ఉంటుంది. వెదురును నరకటం, నాన పెట్టటం మనకు అవసరమైన సన్నటి బద్దలుగా, తాళ్ళుగా చీల్చటానికి చాలా శ్రమ, సమయము, ఖర్చు అవుతాయి. అందుకే వీటి ఉత్పత్తి తక్కువగా ఉండి, ఖరీదు ఎక్కువగా



ఉండటం జరుగుతోంది.

ఈ సమస్యను పరిష్కరించటానికి ఝార్ఖండ్ లోని సుమిత్ మురారి అనే విద్యార్థి వెదురుని సన్న బద్దలుగా, తాళ్ళుగా చీల్చటానికి, బుట్టలు, తట్టలుగా అల్లటానికి అనువైన ఒక చిన్న యంత్రాన్ని రూపొందించాడు. దీని సహాయంతో సాధారణంగా 3−4 బుట్టలు అల్లే వ్యక్తులు 10−15 బుట్టల వరకు అల్లవచ్చు. ఈ యంత్రం ఉపయోగించే తయారు చేసే బుట్టలు చూడటానికి మొరటుగా ఉండకుండా, నాజూకుగా, అందంగా ఉంటాయి. ఈ యంత్రాన్ని ఉపయోగించి వస్తువులు తయారు చేసిన చాలా మంది నాణ్యత బాగున్నదని, సమయము, ఖర్చు కలిసి వస్తోందని, అందంగా ఉండటం వల్ల ఎక్కువ ధరకు కూడా అమ్మగలుగుతున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ యంత్రాన్ని కనుగొన్న సుమిత మురారికి పుస్తకాలు చదవటం, చిత్రలేఖనము, కథలు చెప్పటం అంటే ఇష్టం. పెద్ద అయిన తర్వాత తాను అణు శాస్త్రవేత్తను అవుతానని, భారత దేశం అణు రంగంలో స్వయం సమృద్ధి సాధించటానికి దోహద పడతానని ఉత్సాహం చూపిస్తున్నారు.

ఎంతోమంది వెదురు కళాకారుల శ్రమను తగ్గించే నాణ్యమైన ఉత్పత్తి పెంచటానికి దోహద పడిన సుమిత్ మురారికి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ 2023లో తమ 11వ జాతీయ ద్వైవార్షిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో విద్యార్థుల విభాగంలో ప్రోత్సాహక బహుమతి ఇచ్చి సత్కరించారు.



## సమాజానికి 'పల్లెసృజన' విజ్ఞప్తి

చుట్టూ ఉన్న సమాజంలోని కష్టాలను గమనించండి. ఆ కష్టాలను సంపూర్తిగా అవగాహన చేసుకొని వాటి నివారణకై సమాజంలో చర్చలు జరపండి. సరియైన పరిష్కారాన్ని ఇన్నోవేట్ చెయ్యండి. అది ప్రజలకు అందుబాటులో ఉండేట్లుగా, అవసరానికి తగ్గట్లుగా, వైవిధ్యానికి వాతావరణానికి తోడు చేసేట్లుగా ఉండాలి. ఇలాంటి ఇన్నోవేషన్లు ప్రజలకు చేరిస్తే ఈ దేశం నిజమైన ఆత్మ నిర్భరత ను సాధిస్తుంది. మీకు ఎటువంటి సాంకేతిక పరమైన అవసరాలున్నా 'పల్లెసజన' ను సంప్రదించ దానికి సంశయించకండి. సమస్య పరిష్కారానికి మీ ఆలోచనను తెలియజేసినా, అది కార్యరూపం దాల్చేలా చేద్దాం.

\- పల్లెసృజన.

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India

## జాతీయ 14 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**



**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 14వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

### ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ** రెండవ **బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును.** అంతే కాదు ప్రోత్సాహక **బహుమతి** క్రింది **రూ. 10,000లను** వివిధ **వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.**

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2025** లోగా మాకు చేరేలా పంపండి.

### దరఖాస్తు దారులకు గమనిక

**వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.**
**మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫోటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.**
**దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.**
**మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.**
**మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.**

### దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2025

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

---

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా **'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : 040−40253096)** సంప్రదించండి.

# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- వీరరాఘవ రెడ్డి

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 77 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

## కలుపు నివారణకు రైతుల సృనాత్మక ఆలోచనలు

## పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన చిన్న పరికరాలతో స్వయం ఉపాధి

రైతుకు పొలంలో పంట పెరిగితే ఆనందమే. కానీ దానికి ప్రతి బంధకంగా పంటతో పాటు కలుపు పెరుగుతూ వుంటే సహించలేడు. స్వయంగా కలుపు తీసుకోలేక, కూలీలు దొరకక చాలామంది రైతుల పొలాలు బీళ్ళుగా మారిపోయాయి. ఒక్కోసారి ఎక్కువ రోజులు వర్షాలు పడి కాస్త తెరిపి ఇస్తే చాలు అందరూ కలుపు నివారణపై పడిపోతారు. అందువల్ల కూలీల లభ్యత చాలా కష్టంగా మారిపోతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో కలుపు నివారణ మందుల వైపు వెళ్తున్నారు. కానీ కలుపు మందును ప్రధాన పంటకు తగలకుండా ఎలా కొట్టాలా అని ఆలోచిస్తూ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వుండి పోతున్నారు కొందరు రైతులు. ఎందుకంటే కలుపు నివారణకు మందు కొడితే ప్రధాన పంట నాశనమై పోతుంది.

ఆవసరం ఆలోచింప చేస్తుంది అనటానికి ఎవరో ఒక రైతు కనిపెట్టిన ఉపాయం చాలా మంది రైతులకు ఎంతో ఊరట ఇచ్చింది. ఈ పద్ధతి ఎవరికి వారు తయారు చేసుకోవటమే. దీన్ని మార్కెట్‌లోకి వెళ్ళి కొని తీసుకు రావాల్సిన అవసరం లేదు. కానీ, అలా తయారు చేసుకుని తన పంటను కాపాడుకునే అవకాశం లేని కొందరు పెద్ద కమతాలున్న రైతులు ఏమి చేయాలో తెలియక ఒక్కోసారి కొంతమంది రైతులు కలుపుతో పాటు, పంట మొత్తాన్ని దున్నేసి మరో పంట వేసుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ఒక మంచి ఆలోచన చేసిన ఆ రైతును 'పల్లెసృజన' మనస్ఫూర్తిగా అభినందిస్తోంది. దీన్ని ఆచరించేలా ఒక యువత సమూహంగా ఏర్పడితే మీ గ్రామంలోని రైతుల పొలాల్లో కలుపు లేకుండా మీరే నివారించవచ్చు. ఇది మీ ఊర్లో, మీ తల్లిదండ్రులకు తోడుగా ఉంటూ మీకు లభించే గొప్ప ఉపాధి అవకాశం. మీ ఉపాధి అవకాశాల వివరాలకు ఇక్కడ గమనించండి.

**పంటకు తగలకుండా కలుపు మందు పిచికారి చేసే పద్ధతి :**

6 అంగుళాల పివిసి పైపును ఒకదాన్ని తీసుకుని, దాన్ని నిలువునా సగానికి కోసివేయాలి. అప్పుడు రెండు ముక్కలుగా (ఒక దోని లాగా) తయారవుతాయి. అలా సగానికి కోసిన రెండు పైపులకు ఒక కొసలో తాడు కట్టి (5–6 అడుగుల తాడు) ఆ తాడు మరో కొసలో ఒక వెదురు కర్రకు కట్టి వుంచాలి. రెండు పైపులను పంట వున్న సాలు పైన

బోర్లించి కర్రను లాక్కుంటూ వెళ్తే ఆ వైపు పంటను కప్పివేస్తుంది. వైపు కప్పి వున్నంత మేర మధ్యలో వున్న కలుపుపై పిచికారి చేస్తూ వెళ్తే చాలు పంటకు ఎటువంటి హాని జరగకుండా కలుపు మందు పిచికారి చేసుకోవచ్చు. కానీ కలుపు నివారణ మందులు చాలా ప్రమాదకరం అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు కాబట్టి అటువంటి ప్రమాదకర రసాయనాలు వీలైనంత వరకు ఉపయోగించకుండా వుంటే మంచిది అని పల్లెసృజన సూచిస్తోంది.

**అంతర సేద్యం చేయటానికి చేతి పరికరం:**

చిన్నకారు రైతులు అంతర సేద్యాల కొరకు ఎద్దులను కిరాయి తీసుకోవాలన్నా ఇబ్బందే, మనుషులు చేయాలన్నా ఇబ్బందే. అటువంటి వారి కోసం పల్లెసృజన వెలుగులోకి తెచ్చింది ఒక పరికరం. అమరావతి ప్రాంతానికి చెందిన ఒక రైతు నారాయణ రెడ్డి, అతని మిత్రుడైన వెల్డింగ్ షాపు యజమాని కె.ఎల్. పాల్ అనే ఇద్దరు కలిసి ఒక పరికరాన్ని తయారు చేశారు. ఆ పరికరానికి ఒకవైపు గొర్రు మరోవైపు గుంటక పలుగు ఏర్పాటు చేయబడి వుంటాయి. ఆ పరికరాన్ని మనుషులు లాగి పని చేసుకోవచ్చు. ఒకసారి గొర్రు ఉపయోగించి, మరోసారి అదే పరికరాన్ని తిప్పి వేసి గుంటక తోలుకుంటే కలుపు నివారణ త్వరగా చేసుకోవచ్చు.





**మొక్కలు, చెట్ల మధ్యన కలుపు నివారణకు చేతితో పనిచేసే పరికరం:**

ఆ తర్వాత చెట్ల మధ్యన కలుపు నివారణకు కూడా పల్లెసృజన వెలుగులోకి తెచ్చిన మరో పరికరం 'కుర్ఫీ'. దీనికి 6 అడుగుల కర్రను తగిలించుకొని, చేతితో తక్కువ శ్రమతో మొక్కల మధ్య కలుపును సులభంగా నివారించుకోవచ్చు. సాధారణంగా 10 మంది కూలీలు చేసే పనిని కేవలం ఇద్దరంటే ఇద్దరు వ్యక్తులు ఎటువంటి శ్రమ లేకుండా చేస్తారు.

ప్రస్తుత పరిస్థితుల్లో కలుపు నివారణ రైతులకు పెద్ద సమస్యగా మారుతున్నది. కాబట్టి ఇక్కడ వివరించిన పనులన్నీ కేవలం యువకులు మాత్రమే చేయగలిగే పరికరాలతో పనులను అలుపు లేకుండా చేసుకోవచ్చు. కాబట్టి గ్రామాల్లో యువతీ యువకులు ఒక సమూహంగా ఏర్పడి ఈ పనులను చేయటం ద్వారా అటు రైతులు ప్రతి ఒక్కరూ కూలీల కొరకు వెంపర్లాడ వలసిన పని లేకుండా మీ సమూహాలను సంప్రదించి వారి పనులను చేయించుకోవడమే కాక, గ్రామాల్లో యువతీ యువకులు మీ గ్రామంలోనే స్వయం ఉపాధి పొందటం ద్వారా అటు రైతుకు కొంత వరకు కలుపు నివారణ ఎలా అన్న భయం పోవటమే కాక, ఇటు మీకు కూడా మీ గ్రామంలోనే స్వయం ఉపాధి పొందవచ్చు. ఈ సౌకర్యాలను వినియోగించుకుని యువతీ యువకులు మీ గ్రామంలోనే ఉంటూ మంచి పేరు ప్రఖ్యాతులతో పాటు, మంచి ఆదాయాన్ని కూడా పొందాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'. ●

**పరికరాల కొరకు సంప్రదించండి: వీరరాఘవ రెడ్డి, 8125799904, సుభాష్ చందర్, 9652801700**






## హనీబీ నెట్‌వర్క్ సృజనాత్మక & సమ్మిళిత ఇన్నోవేషన్ పురస్కారాలు - ఇండియా

# HBNCRIIA - INDIA

**సమాజానికి ఉపయోగ పడే ప్రత్యేకమైన సృజనాత్మకత మరియు ఆవిష్కరణల ద్వారా భారత దేశాన్ని వినూత్నంగా మార్చడంలో ఇన్నోవేటర్ల సహకారానికి గుర్తింపును తీసుకు వచ్చేందుకు మీ ఆవిష్కరణలను మాతో పంచుకోండి.**

**మీ సృజనాత్మకత / ఆవిష్కరణ గురించి మాకు తెలియజేయటానికి**

**దరఖాస్తు చేసుకోవటానికి చివరి తేది : 31 జనవరి, 2024.**

**పూర్తి వివరాల కొరకు సంప్రదించండి : పల్లెసృజన, 77 వాయుపురి, హైదరాబాద్ - 500 094. ఫోన్ : 9866 00 1678**

**ఉద్దేశ్యాలు :**

- అన్ని రంగాల నుంచి 2,000 పునాది స్థాయి ఇన్నోవేటర్లను గుర్తించి, వాటిలో నుంచి 15 ప్రత్యేకమైన ఇన్నోవేషన్‌లను ఎంపిక చేసి వారిని జాతీయ స్థాయిలో జరగబోయే కార్యక్రమంలో సన్మానించటం.
- సామాన్య ప్రజలలోని సృజనాత్మకతను గుర్తించి, వారికి గుర్తింపు, గౌరవం, సత్కారం జరిగేలా చూసి, వారిని హనీబీ నెట్‌వర్క్ లో భాగస్వాములను చెయ్యటం.
- ప్రత్యేకమైన సాంప్రదాయ జ్ఞానాన్ని గుర్తించి – దానిని అభివృద్ధి మరియు విలువ పెంచటానికి తోడ్పడి, భారీ స్థాయిలో వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయటానికి, స్వయం సమృద్ధి పద్ధతిలో సహకరించటం.

**అర్హత వివరాలు :**

- ఇన్నోవేషన్ ఏ ప్రాంతానికైనా/ రంగానికైనా/ వ్యవసాయ/ వ్యవసాయేతర ఉపయోగాలు, విద్య, వసతులు, సాంప్రదాయ జ్ఞానము, పర్యావరణం, స్త్రీల శ్రమ తగ్గించటం, జీవనోపాధి, అందుబాటులో ఉండటం – మొదలైనవి అయి ఉండాలి.
- వయస్సు, లింగభేదం, వర్గం, విద్యకు సంబంధించిన ఏ విధమైన ప్రతిబంధకాలు లేవు. ఎవ్వరైనా పాల్గొనవచ్చు.
- ఇన్నోవేషన్‌లు సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలకి దోహద పడేలా ఉండాలి.
- ఇన్నోవేషన్‌కి ఇంకా అభివృద్ధి చేయగలిగే అవకాశాలు ఉండాలి.
- ఇంతకు ముందు చిన్న స్థాయిలో ఆర్థిక సహాయం పొందిన, చిన్న బహుమతులు పొందిన ఇన్నోవేషన్‌లు కూడా పాల్గొనవచ్చు. కానీ, జాతీయ స్థాయి లేదా భారీ స్థాయిలో గుర్తింపు లేదా పెట్టుబడులు పొందిన ఇన్నోవేషన్‌లు పాల్గొనటానికి వీలు లేదు.

**బహుమతుల వివరాలు :**

**జాతీయ స్థాయిలో ఎంపిక చేసిన 15 మందికి బహూకరించ బడుతుంది.**

❀ **మొదటి బహుమతి :** 5 లక్షల రూపాయలు ❀ **రెండవ బహుమతి :** 3 లక్షల రూపాయలు

❀ **మూడవ బసుమతి :** 2 లక్షల రూపాయలు ❀ **12 మందికి ప్రోత్సాహక బహుమతులుగా** ఒక్కొక్కరికి రూ. 50,000/–

❀ గ్యాన్ ❀ అమెజాన్ వారు గుర్తించినట్లుగా ఒక ప్రశంసా పత్రం అందరికీ అందజేయబడుతుంది.




మీ దరఖాస్తులను ఈ చిరునామాకు పంపండి...

Email : gian@gian.org
or post them to
GIAN, Bungalow No. 1,
Sattellite Complex, Nr. Mansi Crossroads,
Satellite, Ahmedabad – 380 015. Gujarat
Call us at : 079 26769686

# సెప్టెంబర్ - అక్టోబర్ 2023లో జరిగిన 'పల్లెసృజన' విశేషాల చిత్రాలు



26 ఆగస్టు, 2023న 'ధాత్రి ఫౌండేషన్', హైదరాబాద్ నుండి 17 మంది సభ్యుల బృందం 'పల్లెసృజన కార్యాలయాన్ని సందర్శించారు. వారంతా తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర మరియు గుజరాత్ రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాలకు చెందిన హరిజన, గిరిజన, ఆదివాసి యువత. సమాజంలోని సమస్యలను ఎలా గుర్తించాలి, ఎలా పరిష్కరించాలి, పునాది స్థాయి ఇన్నోవేషన్‌లు మరియు వ్యవసాయం, సాంకేతికతపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొన్నారు.




15 అక్టోబర్, 2023న సికింద్రాబాద్‌లో జరిగిన 'అబ్దుల్ కలాం' జన్మదిన వేడుకల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు పాల్గొనటం జరిగింది.




23 సెప్టెంబర్, 2023న హైదరాబాద్ రామచంద్ర పురం లోని 'రాజరత్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల'లో జరిగిన 'గమంత్ర ఇన్నోవేషన్ ఎగ్జిబిషన్ ఫెయిర్'లో 8 మంది 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు పాల్గొని 25 ఇన్నోవేషన్లను ప్రదర్శించారు.



5 సెప్టెంబర్, 2023న హైదరాబాద్ లోని 'విజ్ఞాన భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' విద్యార్థులు మరియు అధ్యాపకులతో పునాది స్థాయి ఇన్నోవేషన్లు, సమాజంలోని సమస్యలకు వాటి ద్వారా పరిష్కారాలు గురించిన పరస్పర చర్చా కార్యక్రమం నిర్వహించ బడింది.



9, 10, 11 అక్టోబర్, 2023న కరీంనగర్‌లో జరిగిన 'కిసాన్ మేళా' లో 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు పాల్గొని 15 ఇన్నోవేషన్లను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు 20 నుండి 25 వేల మంది రైతులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శన ద్వారా ఇన్నోవేటర్లు మంచి వ్యాపార అవకాశాలు పొందారు.




17 అక్టోబర్, 2023న 'ఎన్ఐడిబిఐ' సంస్థ సభ్యులు పల్లెసృజన కార్యాలయాన్ని సందర్శించి, పునాది స్థాయి ఇన్నోవేషన్లను పరిశీలించారు..



4 సెప్టెంబర్, 2023న సి.ఎం.ఆర్. ఇంజనీరింగ్ కళాశాల, హైదరాబాద్ లో నూతనంగా కళాశాలలో చేరిన 1400 మంది విద్యార్థులకు సమాజంలోని సమస్యల పరిష్కారం కొరకు పునాది స్థాయి ఇన్నోవేషన్ (గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్స్)లు ఎలా ఉపయోగ పడుతున్నాయి, వాటిని వెలుగులోకి తీసుకు రావటంలో సాధక బాధకాలు గురించిన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ఏర్పాటు చేయటం ద్వారా నూతన కళాశాల విద్యార్థులు పునాది స్థాయి ఇన్నోవేషన్‌లను ఎంతో శ్రద్ధతో తిలకించి వాటిపట్ల తమ అవగాహనను పెంచుకున్నారు.



4 అక్టోబర్, 2023న పూణే లో జరిగిన 'యోజక్' సమావేశంలో పునాది స్థాయి ఇన్నోవేషన్లు, వాటిని వెలుగులోకి తీసుకు రావటానికి 'పల్లెసృజన' చేస్తున్న కార్యక్రమాలను గురించి వాలంటీర్ 'అఖిల' వివరించినప్పటి చిత్రం.



15 అక్టోబర్, 2023న దేశంలోని వివిధ సంస్థల్లో పని చేస్తున్న 20 మంది శాస్త్రవేత్తలు 'ఐపిఇ' సంస్థ ఆధ్వర్యంలో 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించారు. గ్రామీణ ఇన్నోవేషన్లను గురించి సవివరంగా తెలుసుకున్నారు.



03 అక్టోబర్, 2023న 'తపస్వి' అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించడం జరిగింది. తపస్వి సంస్థ తరుపున వారు చేస్తున్న కార్యక్రమాలను గురించి వారు సుదీర్ఘంగా వివరించడం జరిగింది. అదేవిధంగా 'పల్లెసృజన' చేస్తున్న అనేక కార్యక్రమాలను గురించి వారు అడిగి తెలుసుకోవడం జరిగింది.



27 సెప్టెంబర్, 2023న నర్సాపూర్‌కు చెందిన బివిఆర్ఐటి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సందర్శించారు. మన ఇన్నోవేటర్లు తయారు చేసిన పునాది స్థాయి ఇన్నోవేషన్ల మీద అవగాహన కోసం వారు ఈ కార్యక్రమానికి విచ్చేశారు. సుభాష్ పునాది స్థాయి ఇన్నోవేషన్లను వారికి ప్రత్యక్షంగా చూపించి, వాటిని గురించిన సమాచారాన్ని విశదీకరించారు.



'హనీబీ' ప్రేరణ గొలిపే కథలు

# పెద్ద సమస్యకు చిన్న పరిష్కారం



పూర్వం ఒకానొకప్పుడు బర్మా దేశాన్ని 'అనవర్ధ' అనే రాజు ప్రజారంజకంగా పరిపాలిచేవాడు. ఆయన ప్రజల కోసం ఏమైనా చేయాలన్న తలంపుతో ప్రజలందరూ ప్రశాం తంగా పూజించుకోవటానికి అనువుగా ఒక గుడి కట్టాలని నిర్ణయించుకున్నాడు. వెంటనే ఆయన తన రాజ్యంలోనే ఎత్త యిన, అందమైన గుడిని కట్టమని శిల్పకారులను ఆదేశిం చాడు. గుడి తయా రైంది. రాజ్యంలోని నలుమూలల నుంచి ప్రజలు గుడి ప్రారంభోత్సవానికి వచ్చారు. రాజు అనవర్ధుడు కూడా గుడి శోభను, ఆకాశాన్నంటే గోపురాన్ని చూసి అబ్బుర పడ్డాడు. గుడి శిఖరాన్ని చూడాలని ఆయన తల యెత్తినపుడు ఆయన తలపై వున్న కిరీటం పెద్ద శబ్దం చేస్తూ క్రింద పడింది. ఈ ఇబ్బందికర పరిస్థితిని అవమానం గా భావించిన రాజు చక చకా తన కోటకు వెళ్ళిపోయా డు. అందరూ తనను అవహే ళన చేస్తారని భయపడ్డా డు. గుడి గొప్పతనం, శిఖరము చూడ టానికి తల యెత్తి న ప్రజలం దరి తలపాగాలు క్రింద పడిపోతా యేమో అన్న భయంతో గుడిని చూడటానికి రారేమోనని భావించాడు.

రాజు కొన్ని వారాలపాటు చంచల మనస్సుతో ఉన్నాడు. పరిపాలనను నిర్లక్ష్యం చేశాడు. ఎంతో ప్రజాదరణ కలిగిన రాజు ఈ విధంగా అయిపోయినం దుకు ప్రజలు చాలా ఆందోళనకు గురయ్యారు. ఒకరోజు ఒక జాలరి కొడుకు రాజ దర్శనానికి వచ్చాడు. అతను రాజుతో "రాజా మీరా గుడి చుట్టూ ఒక నీటి గుంటను త్రవ్వించండి" అని సలహా ఇచ్చాడు. రాజు ఒక్క క్షణం ఆలోచించి, తల పరికించి, అతన్ని వెళ్ళిపొమ్మన్నాడు. రాజు శిల్పకారులను పిలిపించి, "వెంటనే గుడి చుట్టూ నీటి గుంట ఏర్పాటు చెయ్యి"మని ఆదేశించాడు. ఆయన చెప్పడమేమిటి, రెండు రోజుల్లో కందకం తయారైపోయింది. రాజమహల్ నుండి ప్రజలందరికీ రెండవ సారి గుడి ప్రారంభోత్సవానికి ఆహ్వానాలు వెళ్ళాయి. వచ్చిన వారిని రాజు గుడి ద్వారం వద్దే ఆహ్వానించి కందకం లోనికి క్రిందకు చూశాడు. క్రింద నిశ్చలమైన నీటిలో ఆయనకి అందమైన గుడి శిఖరం ప్రతిబింభం కనుల పండువగా కనిపించింది. ఆయన తల పైకెత్తి శిఖరాన్ని చూడలేదు. తన చుట్టూ వున్న ప్రజల ముఖాలలో తనకు కలిగిన ఆనందం ప్రతిబింబమే కనిపించింది.

**గొప్పతనం అన్నది పైకి చూడటంలో, ఎత్తయిన కట్టడాలను చూస్తే రావు. కిందకి చూడటంలో అవమానమేమీ లేదు. ఎందుకంటే మంచి ఆలోచనలు ఎక్కడినుంచైనా రావచ్చు. జాలరి కొడుకు వద్దనుంచైనా సరే. మనం పైకి చూడాలా లేదా క్రిందకు చూడాలా అనే విషయం తాటిపై నడిచే నైపుణ్యంలా ఉండాలి. ఇక్కడ చివరికి క్రిందికి చూస్తేనే పని జరిగింది. శిఖరం కన్పించింది. శిఖరం కనపడాలంటే పైకే చూడనక్కరలేదు.**

**మీకెప్పుడైనా సామాన్య జనుల నుండి మంచి ఆలోచనలు మీ దృష్టికి వస్తే మాకు తెలియజేయండి. అవి ఆలోచనలు రేకెత్తించేట్లుగా ఉంటే చాలు మన పత్రికలో ముద్రిస్తాం.**

**- హనీబీ (34(1), జనవరి - మార్చి 2023.**

# 'మోధా శివకుమార్'కు
# ప్రతిష్ఠాత్మక 'ఇన్ఫోసిస్ ఫౌండేషన్ - ఆరోహన్-2023 స్పెషల్ జ్యూరీ' పురస్కారం




- వీరరాఘవ రెడ్డి

'పల్లెసృజన' పాఠకులకు "మోధా శివకుమార్" చిర పరిచితులే. చేనేత రంగంలో ఎన్నో సంవత్సరాలుగా వారు పడుతున్న శారీరక శ్రమ, తద్వారా చేనేత పరిశ్రమకు ఒక వయస్సు దాటిన తర్వాత పని చెయ్యలేక దూరమవుతున్న కార్మికుల సమస్యకు సులువైన పరిష్కారం కనుగొన్న విషయం గత సంచికలలో (జనవరి–ఫిబ్రవరి 2019, జనవరి–ఫిబ్రవరి 2021) ప్రచురించటం జరిగింది.

చేనేత రంగంలో ఒక గొప్ప మార్పును తెచ్చే ఇన్నోవేషన్‌ను రూపొందించినందుకు ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పురస్కారాలు ఇతన్ని వరించాయి. ఈ పరంపరలో భారత దేశంలోనే కాదు, అంతర్జాతీయ స్థాయిలో 'సాఫ్ట్‌వేర్ రంగం'లో ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించుకున్న "ఇన్ఫోసిస్" సంస్థ ద్వారా లభించే సత్కారం కూడా ఉంది.

సామాజిక రంగంలో దేశ పురోగతికి దోహదపడే ఉత్తమమైన ఆవిష్కరణలను గుర్తించి, ఆవిష్కర్తలకు ఆర్థిక సహకారం అందించాలన్న ఉద్దేశ్యంతో 'ఇన్ఫోసిస్ ఫౌండేష్' వారు ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి "ఆరోహన్ సోషియల్ ఇన్నోవేషన్ అవార్డ్" పేరున దేశ వ్యాప్తంగా పోటీలను నిర్వహిస్తూ ఉంటారు. ఈ 2023 సంవత్సరానికి గాను 'ఆరోగ్యం, మహిళా సాధికారత, విద్య' అనే మూడు రంగాలలో ఉత్తమమైన ఆవిష్కరణల కోసం పోటీలు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 2,400 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. అందులో నుండి 8 మందిని విజేతలుగా ప్రకటించారు. ఈ 8 మందిలో మన 'పల్లెసృజన' ఇన్నోవేటర్ "మోధ శివకుమార్' ఎన్నిక కావడం 'పల్లెసృజన' కుటుంబానికి ఒక సంతోషకరమైన విషయం.

మోధా శివ కుమార్‌కు "మహిళా సాధికారత" విభాగంలో చేనేత రంగానికి చెందిన "మోధ పెడల్ ఆపరేటింగ్ యంత్రం"ను ఉత్తమమైన ఆవిష్కరణగా ఎంపిక చేయడం జరిగింది. ఇందుకు గాను శివకుమార్‌కు పురస్కారంతో పాటు '10 లక్షల నగదు' పురస్కారాన్ని కూడా బహుమతిగా అందజేశాడు. ఈ ఆవార్డును 23, ఆగస్టు 2023న బెంగుళూరు లో జరిగిన ఒక కార్యక్రమంలో 'ఇన్ఫోసిస్ ఫౌండేషన్' వ్యవస్థాపకురాలు "శ్రీమతి సుధామూర్తి" గారి చేతుల మీదుగా శివ కుమార్ "ఆరోహన్ 2023 స్పెషల్ జ్యూరీ' పురస్కారాన్ని స్వీకరించాడు.


కార్యక్రమానికి ముందుగా ఎంపిక కాబడ్డ ఇన్నోవేషన్లను శ్రీమతి సుదామూర్తి గారికి ప్రదర్శించడం జరిగింది. శివకుమార్ చేసిన ఇన్నోవేషన్‌ను సుధామూర్తి గారు ఎంతో శ్రద్ధతో పరిశీలించి, వయసు మీరిన వారు, మహిళలు, వికలాంగులు తమ చేనేత వృత్తికి దూరం కాకుండా వారిలో మళ్ళీ ఆశలు చిగురింప జేసిన ఇన్నోవేషన్ తయారు చేసినందును శివకుమార్‌ను అభినందించారు.

మోధ శివకుమార్ సాధించిన జాతీయ స్థాయి పురస్కారం






# రంగు రంగుల వరి విత్తనాలతో పొలంలో బొమ్మలు
# రైతు చిన్ని కృష్ణుడు విశిష్ట సృజన


సూర్య మండలం

- పల్లె వీరరాఘవ రెడ్డి

నిజామాబాద్ జిల్లా, జెక్రాన్‌పల్లి మండలం లోని 'చింతలూరు' గ్రామానికి "చిన్ని క్రిష్ణుడు" (చిన్న గంగారాం) అనే రైతు అసలు పేరు 'నాగుల చిన్న గంగారాం'. ఈ రైతును గురించి గత సంచిక జులై–ఆగస్టు 2019 లోనే ప్రచురించిన కథనం ద్వారా 'పల్లెసృజన' పాఠకులకు పరిచితుడే. 115 రకాలకు పైగా దేశీ వరి ధాన్యాన్ని సేకరించి, పండించి, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని రైతులకు ఏ రకం విత్తనం కావాలంటే ఆ రకాన్ని అందించే గొప్ప మనసున్న రైతు. ఈయన ఎన్నో రకాల వరి విత్తనాలను పండించటమే కాదు, వరి నాటడంలో కూడా ఒక ప్రత్యేకత ఉండాలని తపించే వ్యక్తి.

పొలంలో ఏ బొమ్మ రావాలని అనుకుంటాడో ముందుగా 'మహదేవ్' అనే తన ఆర్టిస్టుతో చర్చించి, వివరించి పొలంలో ఆ బొమ్మ వేసేలా ఏర్పాటు చేసుకుంటాడు. చిన్ని క్రిష్ణుడు చెప్పిన ప్రకారం బొమ్మను గీసుకొని, ఆ బొమ్మ వరి మాగాణిలో వచ్చేలా ఏర్పాటు చేయటం మహదేవ్ యొక్క గొప్ప నైపుణ్యానికి తార్కాణం. సాధారణంగా ఏదైనా మెట్ట పొలంలో బొమ్మ వేయాలంటే ముందుగా బొమ్మను సున్నంతో మార్కింగ్ చేసి వేయవచ్చు. మహదేవ్ మాగాణిలో తన మదిలో వున్న ఆలోచనతో, కాగితంపైన వేసుకున్న మార్కుల ప్రకారం ఆ బొమ్మ ఆకారంలో చిన్న చిన్న కర్రలను పాతిస్తాడు. ఆ కర్రలకు ఒక సన్నటి తాడు కడతాడు. అప్పుడు బొమ్మ ఆకారం కనపడుతుంది. ఇదంతా క్రింద ఉండి చూస్తే బొమ్మ సరిగ్గా వచ్చిందా రాదా అన్నది కనపడదు. ఒక డ్రోమ్ కెమరా ద్వారా వీడియోలు, ఫొటోలు తీసి చూస్తే బొమ్మ ఆకారం కనపడుతుంది. ఆ బొమ్మలో ఎక్కడ ఏ రకం రంగు పైరు నాటాలో సూచిస్తాడు. ఆ ప్రకారం నాటడానికి చిన్న కృష్ణుడికి లభించిన కూలీలు కూడా గొప్ప కళాకారులే అని చెప్పవచ్చు. చిన్ని కృష్ణుడు, మహదేవ్ గారి ఆధ్వర్యంలో 'జి. హరిత, జి. స్వరూప, ఒడ్డేటి లత' అనే ముగ్గురు కూలీలతో పాటు చిన్ని కృష్ణుడు కూడా వారితో కలిసి నలుగురు ఈ పొలం నాటడానికి 5 రోజులు పట్టింది.


ఆర్టిస్టు మహదేవ్, రైతు చిన్ని కృష్ణుడులతో బ్రిగేడియర్ గణేశం

వరి పంట నాటినప్పుడు పెద్దగా అనుకున్న బొమ్మ కనపడదు. కానీ, పంట ఒక నెల రోజులైన తర్వాత చూస్తే ఆ రైతు కళ్ళల్లో ఆనందం


పొలంలో వరి నాటు వేసిన కూలీలు

తొణికిసలాడుతుంది.

ఇలా ప్రతి సంవత్సరం ఏదో ఒక బొమ్మ వేయటం వల్ల మీకేమైనా లాభం కలుగుతుందా, కష్టం తప్ప ఇలా బొమ్మ వేయటం వల్ల ఫలితం ఏమిటి? అని చిన్ని కృష్ణుడిని అడగగా, ఆయన చెప్పిన సమాధానం 'పల్లెసృజన' బృందాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది.

చిన్ని కృష్ణుడు ఏమన్నాడంటే..... "మనం వేసే పంటలో ఓ ప్రత్యేక గుర్తింపు వస్తే ఆనందంగా ఉంటుంది. దాన్ని చూడటానికి ఎంతోమంది వస్తూ వుంటే వారిలో ఆనందాన్ని చూసి ముచ్చటేస్తుంది. అందుకే ఇలా ప్రతి సంవత్సరం ఒక బొమ్మను వేస్తూ వస్తున్నాను. మొదట సూర్య మండలం బొమ్మ వేశాను, అందులో 49 రకాల వరి పంటను సూర్య మండలంలోని ఒక్కో గడిలో ఒక రకం వచ్చేలాగా నాటాను. గత సంవత్సరం నాకు మా అమ్మా, నాన్నలను నా పొలంలో చూసుకోవాలి అనిపించి, వాళ్ళ బొమ్మ వేశాను. ఇది నాకు అంతర్జాతీయ స్థాయిలో 15 పేటెంట్లతో పాటు, బంగారు పతకం తెచ్చిపెట్టింది. ఈ సంవత్సరం (2023) మన దేశం జి-20 దేశాల అధ్యక్ష స్థానంలో ఉండటం వల్ల భారత దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ జి-20 సదస్సులు నిర్వహించారు. ఆ పరంపరలో తెలంగాణ రాష్ట్రంలో ఆ సదస్సును నిర్వహించే అవకాశం మన 'పల్లెసృజన'కు రావడం, ఆ సదస్సుకు నేను కూడా హాజరు కావడం వల్ల ఈ సంవత్సరం జి-20 బొమ్మ వేయాలి అనుకున్నాను. అప్పుడే 'పల్లెసృజన' వీరరాఘవ రెడ్డి గారు వాట్సాప్‌లో ఒక వాయిస్ మెసేజ్ పెట్టారు. అందులో 'చింతల వెంకట్ రెడ్డి గారి పద్ధతి ప్రకారం పంట ఏదైనా సరే నాటేటపుడు సాధారణంగా కాకుండా గుడిలో ప్రదక్షిణ తిరిగినట్లుగా పొలంలో నాటుకుంటూ పోతే అది దేవునికి నైవేద్యం సమర్పించినట్లుగా ఉంటుంది. ఆ పంట ప్రకృతి వైపరీత్యాలు అయిన ఎండా, గాలి, వానలు ఎక్కువైనా, తక్కువైనా పంట చెక్కు చెదరకుండా ఉంటుంది' అంటూ వీరరాఘవ రెడ్డి గారి మాటలు నాకెందుకో మనసును తాకాయి. ఇలా చేస్తే బాగా ఉంటుంది కదా అనిపించింది.

ఈ విషయం ఇక్కడ నాకు తెలిసిన ఒక డాక్టరు గారిని కలిసి విషయం చెప్పగా, అలాంటపుడు 'సోమసూక్త ప్రదక్షిణ' చేసేలా పంట వేస్తే బాగుంటుంది కదా అన్నారు. అందుకే ఇందులో జి-20 బొమ్మ, ఇండియా అని వ్రాయటం, క్రింద నా బొమ్మ ఒకవైపు, ఓంకారం మరోవైపు వేయటం జరిగింది. మధ్యలో శివలింగము, లింగము పైన గుడి ఆకారం, గోపురం పైన కాషాయ జెండా పెట్టి గుడి చుట్టూ సోమసూక్త ప్రదక్షిణ చేసేలా బొమ్మ వేసి, అందులో తోవ వదలటం వల్ల ఈ సంవత్సరం ఎంతోమంది రైతులు, విద్యార్థులు, యోగా మాస్టర్లు, ఎన్నో స్వచ్ఛంద సంస్థల వారు వచ్చి నా పొలంలో గుడిచుట్టూ తిరిగినట్టు సోమసూక్త ప్రదక్షిణ చేయటం జరిగింది.


చిన్ని కృష్ణుడు పొలం వద్ద 'పల్లెసృజన' బృందం


రికార్డుల పంట పండించిన 'చిన్నికృష్ణుడు'

ఇందులో 1. పంచరత్న, 2. బంగారు గులాబి, 3. కాలా బట్టి, 4. గోదావరి ఉస్కె, 5. చింతలూరి సన్నాలు అనే ఐదు రకాల వరి నారు నాటడం జరిగింది. మనం సాధారణంగా వరిని అందరిలా నాటితే ఈ పంటపైనా పెద్దగా శ్రద్ధ ఉండదు. అదే ఇలా ఏదో ఒక బొమ్మ వచ్చేలా నాటితే ఆ బొమ్మను చూస్తుంటే మనసులో ఒక రకమైన ఆనందంతో కూడిన వైబ్రేషన్స్ వస్తాయి. ఆ బొమ్మను అలాగే చూస్తూ ఉండిపోవాలి అనిపిస్తుంది. అందుకే గత మూడు సంవత్సరాల నుండి ఈ విధానాన్ని పాటిస్తున్నాను. ఈ విధంగా పంట పూర్తయ్యే లోగా ఎంతోమంది తన పొలానికి వచ్చి, తాను నాటించిన బొమ్మను చూసి నన్ను మెచ్చుకుంటూ అంటే ఆ ఆనందానికి ఎలా వెల కట్టగలము? ఇప్పటికి ఈ బొమ్మను చూడటానికి 1500 మందికి పైగా చూడటం జరిగింది. ఈ పంట బాగా రావాలని ఇంకా ఎక్కువ శ్రద్ధ తీసుకుంటాము కదా. ఆ విధంగా పంట బాగా రావటానికి అందరు రైతులకంటే నేను ఎక్కువ శ్రద్ధ తీసుకోవటం వల్ల పంట దిగుబడి కూడా బాగా వస్తుంది. అంతే కాకుండా తనవద్ద వందకు పైగా రకాల వరి విత్తనాలు ఉన్నాయి. వాటిని ఒక్కోటి ఒక్కో మడిలో నాటడం కన్నా, ఈ విధంగా నాటడం ద్వారా వివిధ రకాల వరి విత్తనాలు పండుతాయి, తాను అనుకున్న బొమ్మలో ఈ రకాలను నాటడం ద్వారా విత్తనాలు నాటి సేకరించడం కూడా ఒక పజిలే కదా. అందులోనే నాకు ఆనందం కలుగుతుంది అన్నాడు.

నేను ఇలా చేశాను కాబట్టే ఒక సాధారణ రైతును అయిన నాకు ఇంతటి కీర్తి ప్రతిష్ఠలు రావడం, నా పొలాన్ని వేలాది మంది చూడటం, అంతర్జాతీయ స్థాయిలో 'బంగారు పతకం' లభించేలా చేశాయి కదా. ఒక రైతుగా నేను గోల్డ్ మెడల్ వేసుకుంటానని ఊహించలేదు, కల కనలేదు. ఎన్నో వార్తా పత్రికలు, టీవీ ఛానల్‌ల వారు, ఉన్నతాధికారులు నా పొలం చూసి వెళ్ళటం నాకెంతో ఆనందంగా అనిపిస్తోంది. నాలో ఇంతటి ప్రేరణ కలగటానికి కారణం మాత్రం 'పల్లెసృజన' అని సగర్వంగా చెప్పగలను.

ఈ సంవత్సరం ఈ బొమ్మ వేయటానికి మాత్రం 'పల్లెసృజన', వీరరాఘవ రెడ్డి గారే. వారి వాట్సాప్ వాయిస్ వినకుండా ఉండింటే ఈ బొమ్మ వేసేవాన్ని కాదేమో. అందుకే ఈ క్రెడిట్ మొత్తం 'పల్లెసృజన'కే దక్కుతుంది" అంటారు చిన్ని కృష్ణుడు.

రైతులకు మీరేదైనా సందేశం ఇవ్వాలి అనుకుంటున్నారా అంటే రైతులంతా ప్రకృతి వ్యవసాయంలో దేశీ రకాల విత్తనాలను పండిస్తే, అటువంటి ఆహారం కుండలో వండుకుని తింటే, మనము ఆరోగ్యంగా ఉండటంతో పాటు, సమాజం ఆరోగ్యాన్ని కాపాడామన్న తృప్తి కూడా మనకు మిగులుతుంది. ఒక రైతులో ఇంతటి ప్రేరణ కలిగించడం 'పల్లెసృజన' అదృష్టంగా భావిస్తోంది. ●

**రైతు చిన్ని కృష్ణుడు, ఫోన్ : 9866423439**

# పల్లె జ్ఞానం

### నల్ల తామర (త్రిప్స్) పురుగుల నివారణకు సేంద్రియ మందు :

గుజరాత్‌కు చెందిన భావ్‌నగర్ జిల్లా, జేసర్ తాలూకాకు చెందిన నర్వాన్స్ ఖతాభాయ్ బోహి సాధారణంగా మిరప, బెండ, ఉల్లి పంటలను ఆశించే 'నల్ల తామర (త్రిప్స్)' పురుగుల నివారణకై తానే స్వతంగా తయారు చేసుకున్న ఒక సేంద్రియ ద్రావకాన్ని చాలా సంవత్సరాల నుండి ఉపయోగించి, అసాధారణ ఫలితాలు పొందుతున్నాడు.

మన ప్రాంతంలో కూడా అనేక మంది రైతులు ప్రధానంగా మిరప రైతులు ఇటీవలి కాలంలో ఈ పురుగు తాకిడికి చాలా నష్టపోతున్నారు. వీటి నివారణకు ఎన్ని రసాయన మందులు పిచికారి చేసినా, నివారించలేక పంటను తీసివేస్తున్న విషయాన్ని గమనించి, పల్లెసృజన ఈ మందుని సమయాను కూలంగా ప్రచురిస్తోంది.

ఈ మందు తయారు చేటానికి నర్వాన్స్ 'కాంగ్రెస్ గడ్డి, వేప ఆకులు, గోధుమ పిండి, ఉల్లిపాయలు, బెల్లము, గో మూత్రము' ఉపయోగిస్తాడు. 150 లీటర్ల నీటిలో 20 లీటర్ల గో మూత్రము, కొద్దిగా లేత కాంగ్రెస్ గడ్డి, 2 కిలోల పచ్చి వేపాకుల ముద్ద, నలగకొట్టిన 12 ఉల్లిపాయలు, 1 కిలో బెల్లము, 1 కిలో గోధుమ పిండి వేసి, బాగా కలియ గలిపి, గాలి సోకకుండా బిరడా బిగించి, 40 రోజుల పాటు నిలువ ఉంచాలి. వాన, సూర్యరశ్మి సోకనిచోట నిలువ చేయాలి. 40 రోజుల తర్వాత ఈ మిశ్రమాన్ని కలిపి, వడకట్టి, 20 లీటర్ల సామర్థ్యం వున్న స్ప్రేయర్‌లో 1 లీటర్ ఈ ద్రావణాన్ని కలిపి, పంటపై పిచికారి చేయాలి. ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుందని తెలియజేస్తున్నాడు. ఇది తానే కాక, పరిసర ప్రాంతాల్లోని రైతులు కూడా ఉపయోగించి త్రిప్స్ ను నివారించ గలుగుతున్నారు అంటున్నాడు నర్వాన్స్.

ఈయనే ఇంకొక పద్ధతి కూడా తాను ఉపయోగించటమే కాక, ఇతరులకు కూడా సిఫారసు చేస్తున్నాడు. ఈ పద్ధతిలో ఇంగువ, పసుపు, వాములను ఉపయోగిస్తాడు. సమపాళ్ళలో వీటిని తీసుకుని 2 లీటర్ల నీటిలో నానబెట్టాలి. 15 రోజుల తర్వాత ఆ ద్రావకాన్ని వడకట్టి పురుగు సోకిన పంటపై పిచికారి చేస్తే మంచి ఫలితం ఉంటుంది. 15 రోజులు ఆగలేని వారు అత్యవసరంగా మందు వాడాల్సిన పరిస్థితి ఏర్పడినపుడు 2 లీటర్ల నీటిలో పసుపు, ఇంగువ, వాములను వేసి, వాటిని ఒక లీటర్ ద్రావణం అయ్యేంత వరకు మరగబెట్టాలి. ఈ ద్రావణాన్ని చల్లారిన తర్వాత వడకట్టి ఒక లీటరు నీటిలో 10 మి.లీ. ఈ ద్రావకాన్ని కలిపి పంటపై పిచికారి చెయ్యవచ్చు.



### పంటలలో 'పేనుబంక' పురుగు నివారణకు సేంద్రియ మందు :

గుజరాత్‌కు చెందిన బవళ తాలూకా లోని 'సవితా బెన్' అనే మహిళ ఒక సేంద్రియ రైతు. ఆమె సేంద్రియ వ్యవసాయంలో జీవామృతం, సేంద్రియ పద్ధతిలో విత్తనాలను శుద్ధి చేయటానికి బీజామృతము మొదలైనవి తయారు చేసి, తాను ఆచరించటమే కాక, మహిళా గుంపు సభ్యుల ద్వారా కూడా ప్రచారం చేస్తూ ఉంటుంది.




పంటలను ఆశించే పేనుబంక పురుగుల నివారణకు ఆమె స్వయంగా ప్రయోగాలు చేసి కనిపెట్టిన ఒక సేంద్రియ మందును ఉపయోగిస్తూ ఉంటుంది. దీనిని తయారు చేయటానికి ఆమె 'గోధుమ పిండి, బెల్లము, వాము, గోమయము, గో మూత్రము' ఉపయోగిస్తుంది. దీనికి ఈమె 12 లీటర్ల నీటిలో 3 లీటర్ల గోమూత్రము, ఒక కిలో గో మయము, 500 గ్రా. బెల్లము, 500 గ్రా. గోధుమ పిండి, కొద్దిగా వాము, వేపాకులను కలిపి ఒక వారం రోజుల పాటు నిలువ ఉంచుతుంది. వారం తర్వాత ఈ మిశ్రమాన్ని బాగా కలియదిప్పి, వడకట్టి, ఒక లీటర్ మిశ్రమాన్ని 20 లీటర్ల నీటి సామర్థ్యం కల స్ప్రేయర్ లో కలిపి పంటపై పిచికారి చేస్తే 'పేనుబంక' పురుగు నుండి పంటలను రక్షించుకోవచ్చు అంటుంది.

#### పంటల ఎదుగుదలకు :

దీని తర్వాత పంటల ఎదుగుదలకి ఆమె అరటి పండ్లు, శనగ పండి, కొబ్బరి నీళ్ళు, నెయ్యి, బెల్లము, పాలు కలిపి ఒక మిశ్రమాన్ని వాడుతుంది. ఈ మిశ్రమాన్ని తయారు చేయటానికి 3 లీటర్ల పాలు, అర లీటరు కొబ్బరి నీళ్ళు, 3 లీటర్ల పెరుగు, 12 వలిచి చిదిపిన అరటి పండ్లు, 500 గ్రా. నెయ్యి, 500 గ్రా. శనగ పిండి కలిపి 7 రోజుల పాట మురగ బెడుతుంది. ఆ తరువాత ఈ మిశ్రమాన్ని వడకట్టి 150 లీటర్ల నీటిలో కలిపి పంటకు డ్రిప్పు ద్వారా కానీ, లేదా చెట్టు మొదలు వద్ద కొద్దిగా పోయటం ద్వారా కానీ మొక్కకు అందిస్తే పంట బాగా ఎదిగి అద్భుతమైన ఫలితాలు పొందవచ్చు అంటుందీమె.

#### పశువులలో గర్భస్రావం కలుగకుండా :

పశువులలో తరచూ గర్భస్రావం అవుతూ ఉంటే, అలా జరగకుండా ఉండటానికి ఈమె ఒక ప్రత్యేకమైన మందును తయారు

చేసుకుని వాడుతుంటుంది. దీనిని తయారు చేయటానికి ఆమె 200 గ్రా. వెలగపండు చెట్టు ఆకులు, 100 గ్రా. సోంపు, 100 గ్రా పటిక బెల్లములను కలిపి మెత్తగా నూరి, పశువుచేత 3–4 రోజుల పాటు తినిపిస్తేత గర్భం నిలిచి, సుఖ ప్రసవం అయ్యే అవకాశాలు మెరుగు పడతాయని అంటోంది సవితా బేన్.

## పుచ్చకాయల్లో తీపిని పెంచటానికి సేంద్రియ మందు:

గురాత్ లోని రాజ్‌కోట్ జిల్లా, జాస్దాన్ కు చెందిన 'అశోక్ భాయ్ ఆర్. రంగాణి' అనే రైతు ముఖ్య పంటగా పుచ్చకాయలను పండిస్తూ ఉంటాడు. పుచ్చకాయలలో తియ్యదనాన్ని పెంచటానికి ఆయన ఒక చిట్కా వాడతాడు. సరిగ్గా పూత నుండి కాయ వచ్చే తరుణంలో తీగ చివర్లను (కొసలను) తుంచేసి, వాటిని 100 గ్రాముల బెల్లముతో కలిపి మెత్తగా నూరి, ఈ ముద్దలో పావు లీటరు పాలు, 15 లీటర్ల నీటిని కలిపి చెట్టు మొదళ్ళతో పాటు చెట్టు మొత్తం తడిచేలా పిచికారి చేస్తే పుచ్చకాయలో తియ్యదనం బాగా పెరుగుతుంది అని అంటాడీయన. ఇంత చెయ్యలేని వాళ్ళు కేవలం పూత నుంచి కాయ వచ్చే దశలో తీగ కొసలను (చివర్లను) తుంచేస్తే చాలు తీగ ఎదుగుదల ఆగి, తీగ మొత్తం బలంగా తయారై ఆ బలమంతా పళ్ళకే అంది కాయలు పెద్దవిగా తయారవటంతో పాటు, వాటిలో తియ్యదనం కూడా పెరుగుతుంది అంటాడీయన.



## పశువులలో మావి త్వరగా బయటకు రావటానికి చిట్కా:

గుజరాత్ రాష్ట్రం లోని ఆహమ్మదాబాద్ జిల్లాకు చెందిన హన్సాబెన్ విఠల్‌భాయ్ పటేల్ అనే మహిళా రైతు ప్రస్తుతం వ్యవసాయం చేయక పోయినా, తాను ఉపయోగించే చిట్కాలు నలుగురికీ చెబుతూ



ఉంటుంది. అందులో ఒకటి 'పశువులలో మావి త్వరగా బయటకు రావటినికి' ఆమె గురివింద గింజల కషాయం వాడుతుంది.

అదేవిధంగా పశువుల పొట్టలో నులి పురుగులు పోవటానికి కొద్దిగా ఎక్కువ ఉప్పు కలిపిన మజ్జిగను తాగిపిస్తుంది.

అలాగే ఎండా కాలంలో పశువులు చల్లగా ఉండటానికి తవుడు, చిరు ధాన్యాల పిండి, గోధుమ పిండి కలిపిన సంకటి తయారు చేసి తినిపిస్తుంది.

## పంటలలో చీడ పీడల నివారణ చర్యలు:

గుజరాత్ రాష్ట్రంలోని బాణస్కాంత జిల్లాకు చెందిన మేద్‌రాజ్ పటేల్ అనే రైతు గత పదేళ్ళ నుండి సేంద్రియ వ్యవసాయం చేస్తూ జీవామృతం, బీజామృతం, దశపర్ణి మొదలైన కషాయాలు వాడుతూ ఉంటాడు. ప్రత్యేకించి పొలంలో మట్టిని చీడ పీడలు లేకుండా సిద్ధం చేయటానికి 200 లీటర్ల నీటిలో 20 కిలోల గోమయాన్ని కలిపి25 రోజుల పాటు మురగబెట్టి, ఆ తర్వాత అందులో కొద్దిగా వేప నూనె కలిపి పొలంలో చల్లుతాడు. 3 రోజుల తర్వాత పంట విత్తుతాడు.

పంటలకి సోకే పేను బంక, నల్ల తామర, ఆకు తొలుచు పురుగు మొదలైన క్రిముల నుండి పంటను రక్షించటం కోసం ఈయన కలబంద, వేప నూనె, గోమూత్రము, పుల్లటి మజ్జిగ ఉపయోగిస్తాడు. 10 లీటర్ల పుల్లటి మజ్జిగలో, 10 లీటర్ల గోమూత్రాన్ని కలిపి అందులో అర లీటరు వేపనూనె, 500 గ్రాముల కలబంద గుజ్జు కలిపి వాటిని బాగా కలియబెట్టిన తర్వాత ఈ మిశ్రమాన్ని వడకట్టి, 200 లీటర్ల నీటిలో కలిపి పంటపైన పిచికారి చేస్తే పైన చెప్పిన చీడల నుండి రక్షణ పొందవచ్చు.



## ప్రకృతి వైద్యాన్ని కాపాడుకుందాం

పాఠకులకో మనవి. మారుతున్న కాలంలో సాంప్రదాయ వైద్యులు కనుమరుగై పోతున్నారు. కొన్ని గ్రామాల్లో వైద్యులతోనే చాలా వరకు రోగాలు నయమై పోతున్న విషయం అందరికీ తెలిసిందే. అక్కడక్కడా వున్న వారి జ్ఞానం, వారితోనే అంతం కాకుండా భవిష్యత్ తరాలకు అందించాలంటే అటువంటి వైద్యాలు గ్రంథస్తం చేయటం ఎంతో అవసరం. మీకు తెలిసిన సాంప్రదాయ (నాటు/ఆయుర్వేద) వైద్యులు ఎవరైనా వుంటే వారి జ్ఞానాన్ని మాతో పంచుకోండి. వాటిని ప్రచురించి అందరికీ అందజేద్దాం, తరతరాల జ్ఞానాన్ని రాబోయే తరాలకు అందిద్దాం. - ఎడిటర్

'హనీబీ నెట్‌వర్క్', 'పల్లెస్సృజన' ల ద్వారా వెలుగులోకి వచ్చిన

## 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్న సామాన్యులు

## Padmasri Awards

స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

# పోచంపల్లి నేత కుటుంబాల జీవితల్లో రంగులు నింపిన 'పద్మశ్రీ' మల్లేశం

- జమ్మలమడక శశిమోహన్



ఎన్ఐఎఫ్ ద్వారా రాష్ట్రపతి పురస్కారం - 2009


పద్మశ్రీ పురస్కారం - 2017

చింతకింది మల్లేశం మనకు తెలియని వాడేమీ కాదు. ప్రస్తుతం 51 సంవత్సరాలున్న మల్లేశం తన తల్లి పోచంపల్లి చీరలకి ఆసు పోస్తున్నపుడు ఆమె పడే కష్టం చూడలేక, భుజాల నొప్పులతో ఆమె చేయలేక చేయలేక పని చేస్తున్న పరిస్థితిని గమనించి ఆమె కష్టాన్ని తీర్చాలన్న దృఢ నిశ్చయంతో, తనకి తెలియని విషయాలు తెలుసుకొని, చదువని విషయాలు చదువుకొని, ఎంతో శ్రమించి ఆసు పోయటానికి ఒక యంత్రాన్ని కనుగొన్నాడు. ఆమె కష్టాన్ని తీర్చటానికి తయారు చేసిన యంత్రం పేరు 'లక్ష్మి ఆసు యంత్రం' అని పెట్టుకున్నాడు. అప్పుడు కేవలం తన కన్నతల్లి పడ్డ కష్టాన్ని తీరుస్తున్నాను అనుకున్నాడే తప్ప పూర్తి పోచంపల్లి చేనేత వ్యవస్థనే మార్చగల సత్తా తన ఆవిష్కరణకు ఉందని అప్పుడు ఆయనకు తెలియదు. మల్లేశం కనిపెట్టిన ఆసు యంత్రం చేనేత పరిశ్రమలో ఒక విప్లవం తీసుకు వచ్చిందనే చెప్పాలి. కొత్త డిజైన్లు, కొత్త రంగులు, కొత్త మార్కెటు, అందరికీ చేతినిండా పని, అందరికీ లాభాలు. ప్రతి ఇంట్లో పండగ వాతావరణం సృష్టించటానికి కారణమైంది ఈ యంత్రం.

శ్రీమతి లక్ష్మి, శ్రీ లక్ష్మినారాయణ గార్ల పుత్రుడైన చింతకింది మల్లేశం నల్గొండ జిల్లాలోని శారాజీ పేట గ్రామంలో జన్మించాడు. వీరిది అతి సామాన్యమైన కుటుంబం. వంశ పారంపర్యంగా చేనేత వృత్తినే నమ్ముకొన్న వీరు ఆ ప్రాంతం లోని అన్ని చేనేత కుటుంబాల మాదిరే ఈ వృత్తిని కొనసాగించటం కష్టమై పోయింది. దానికి ముఖ్య కారణం 'చేతితో ఆసు పోయటం'. పద్మశాలి కుటుంబంలో జన్మించిన వారు ముఖ్యంగా మహిళలు సాంప్రదాయంగా చేతితోనే దారాన్ని 42 ఇరుసుల చుట్టూ తిప్పుతూ సుమారు 9000 సార్లు ఆసు పోయాల్సి ఉంటుంది. ఇలా రోజంతా కష్టపడినా ఒకటి రెండు చీరలకన్నా ఎక్కువ అవసరం అయ్యే ఆసు సిద్ధమయ్యేది కాదు. ఇలా నిరంతరం చేతులు తిప్పుతూ ఆసు పోయటం వలన మహిళలకి (ప్రత్యేకంగా మహిళలే ఈ పని చేసేవారు) భుజాల నొప్పులు రావటం, కూర్చునే చేయటం వల్ల నడుం నొప్పులు రావటం, కదుల్తున్న దారాలను తీక్షణంగా చూడటం వల్ల చూపు మందగించటం సాధారణమైన విషయమై పోయేది. దీంతో చాలా మంది ఈ వృత్తినే మానుకొని ఇతర వృత్తులకు మారిపోవడం లేదా పట్టణాలకు వలస వెళ్ళడం జరిగేది.

"నా తల్లి పడే యాతనను చిన్నప్పటి నుండి గమనిస్తునే ఉండేవాడిని. 6వ తరగతి తరువాత చదువు ఆపేశాను. అమ్మకు సహాయం చెయ్యాలనే తపన తప్పితే ఏం చెయ్యాలి? ఎలా చెయ్యాలి? అని తెలియదు. అప్పుడు నా ఆలోచన ఏవిధంగా రూపు దిద్దుకుంటుం దో కూడా నాకు తెలియదు. కానీ చెయ్యాలి, ప్రయత్నించాలి. అప్పటికి నా ఆలోచన అంతే".

ఆయన తల్లి కూడా "బిడ్డా ఈ పనిలో మన భవిష్యత్తు లేదురా, వేరే ఏదైనా వృత్తి ఎన్నుకో" అనేది. ఊళ్లో అందరి మగవాళ్ళ లాగానే మల్లేశం కూడా మగ్గం నేస్తూ ఉండేవాడు. కానీ తల్లి కష్టం తీర్చాలన్న



పట్టుదల అతడిని ఇన్నోవేటర్‌గా మార్చింది. కొత్త రకంగా ఆలోచించటం మొదలు పెట్టాడు. ఎటువంటి పరికరం తయారు చేస్తే తన తల్లి కష్టం తీరుతుందో అని తీవ్రంగా మదన పడేవాడు. 6వ తరగతి వరకు బడికి వెళ్లి, తర్వాత మానేసి, తర్వాత కష్టపడి 10వ క్లాసు పూర్తి చేసినా, చిన్న మల్లేశానికి ఈ ధ్యాస తప్పితే ఇంకేమీ లేదు. కొన్ని సంవత్సరాలు కష్ట పడ్డాడు. తనవద్దనున్న డబ్బంతా ఖర్చు చేశాడు, అప్పులు చేశాడు. "ప్రజలు నన్ను బద్ధకస్తుడిని అన్నారు. కష్టపడి నేతపని చెయ్యటం చేతకాదు అన్నారు. గట్టిగా గదమాయించిన వారి బాకీ తీర్చడానికి ఇంకొకరి దగ్గర అప్పు చేశను. ఏం చదువుకోని వాడివి నీకు యంత్రాల తో పనేంటి? అదే ఇంజనీర్లో, సైన్సు తెలిసిన శాస్త్రజ్ఞులో చెయ్యాల్సిన పని" అనేవారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆయనకి అంతగా నిలిచింది ఆయన భార్య శ్రీమతి సువర్ణ నీ ధృడ సంకల్పం చెదిరిపోకుండా ఉన్నంత కాలం ఎన్ని కష్టాలు వచ్చినా భరిద్దాం. నాకు తెలుసు నువ్వు సాధిస్తావు అనేది. ఇద్దరు కూతుళ్లు కూడా నువ్వు ఈ యంత్రం పూర్తి చెయ్యి నాన్నా, మేమిద్దరము కూడా దీనికి సంబంధించిన చదువులే చదువుతాము. అలా అన్న వారిలో పెద్ద కుమార్తె శ్వేత, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ చేయగా, రెండో కుమార్తె రూప ఫ్యాషన్ డిజైనింగ్ చేసింది. ముమ్ముందు దీనిని ఇంకా ఉచ్చ దశకి తీసుకుని వెళదాము అని, తాము ఎన్ని ఇబ్బందులు పడ్డా, తండ్రికి మాత్రం మానసికంగా ఎంతో దిలాసానిచ్చారు.

యంత్రానికి ఒక రూపం వస్తోంది. ఏదో ఒక్కటే లోపం. అది సాధిస్తే యంత్రం పూర్తవుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో హైదరాబాద్ వెళ్ళాడు. అక్కడ ఒక ఎలక్ట్రీషియన్ దగ్గర పనికి చేరాడు. అప్పుడే తాను తయారు చేస్తున్న యంత్రంలో భాగమైన ఒక పిన్ను చుట్టూ దారం తిరిగి రావటం ఎలాగో కనిపెట్టాడు. యంత్రం తయారైపోయింది. యంత్రం తయారు అవటమే కాదు, ఇంతకు ముందు విమర్శించిన వాళ్ళ, నీవల్ల కాదు నీకు చేతకాదు అన్న వాళ్ళ నోళ్లు మూతలు పడ్డాయి. అకస్మాత్తుగా అవే నోళ్ళు జైజై అనటం ప్రారంభించాయి. మా మల్లేశం ఎంత గొప్పవాడు అని కీర్తించడం మొదలు పెట్టాయి.

యంత్రం పూర్తయినా మల్లేశానికి సంతృప్తి లేదు. యంత్రం బావుంది, పని చేస్తోంది. కానీ చాలా బరువుగా ఉంది. చాలా భాగాలు చెక్కతో చేసినవే. దీన్ని తగ్గించడం ఎలా? మళ్ళీ పని ప్రారంభించాడు. నిష్ణాతుల్ని కలిశాడు. చర్చలు జరిపాడు. తర్జన భర్జనలు పడ్డాడు. చివరికి నాణ్యత గల, తేలికైన యంత్రం తయారు చేశాడు. అందరూ మళ్ళీ బావుందన్నారు. మా మల్లేశం తలుచుకుంటే ఏదైనా చెయ్యగలడు అన్నారు. మల్లేశానికి కూడా తనమీద తనకు నమ్మకం వచ్చింది. ఎక్కువ






చేతితో పని లేకుండా, తనంతట తానే తయారయ్యే విధంగా యంత్రం ఉండాలని తనకి ఓనమాలు కూడా తెలియని ఎలక్ట్రానిక్స్ చదువుకొని తన యంత్రాన్ని కంప్యూటరైజ్ చేశాడు.

ఇది ఒక్కరోజులో జరిగింది కాదు. కొన్ని సంవత్సరాలు పట్టింది. పూర్తి యంత్రం తయారైంది. దానితో పోచంపల్లి ప్రాంతంలో కేవలం నెలకి 5–6 చీరలు నేసేవారు. ఇప్పుడు ఈ యంత్రం రావటం వల్ల నెలకు 6–7 చీరలు నేయ గలుగుతున్నారు. నాణ్యమైన పని జరుగుతోంది. కొత్త డిజైన్లు వస్తున్నాయి. పని త్వరగా అవుతోంది, ఆదాయం పెరిగింది.

"ఈ యంత్రం తయారు అవటంతో ఎంతమంది సంతోషించారో నాకు తెలియదు కానీ నా తల్లి కళ్ళల్లో ఆనందం తళుక్కున మెరవటం నాకు ఎనలేని తృప్తినిచ్చింది" అంటాడు మల్లేశం. ఎవరి కోసమైతే ఈ యంత్రాన్ని తయారు చేశానో ఆమె పేరే నా యంత్రానికి పెట్టుకున్నాను 'లక్ష్మి ఆసు యంత్రం'.

గతంలో మాస్టర్ వీవర్స్ వద్ద 4–6 మగ్గాలు మాత్రమే ఉండేవి. వీటికి కావలసిన ఆసు అందించటం కష్టమయ్యేది. అలాంటిది 'లక్ష్మి ఆసు యంత్రం' వచ్చిన తర్వాత 80 నుండి 100 మగ్గాల వరకు ఆసును అందించి లాభాలు ఆనందంగా సంపాదిస్తున్నారు. నేత కుటుంబాల్లోని స్త్రీలు ఇంట్లో కూర్చుని ఆసు పోయకుండా పై చదువులు చదవగలుగుతున్నారు.

ఆనోటా, ఈ నోటా, ప్రెస్ ద్వారా యంత్రం గురించి తెలుసుకున్న వారు ఎంతోమంది వ్యక్తిగతంగా, గుంపులుగా ఈ యంత్రాన్ని కొనుగోలు చేసి, చితికి పోతున్న తమ కుటుంబాలని సరిదిద్దుకో గలిగారు. ఆర్థికంగా ఎదగ గలిగారు. రెండుపూట్లా తిండికి లేనివారు కూడా వ్యాపారం అభివృద్ధి చేసుకుని, డబ్బు కూడబెట్టుకొని, కొత్త మగ్గాలు కొనుక్కొని, వ్యాపారాన్ని విస్తరించుకొని, హైదరాబాద్‌లో స్థలాలు కొని,500 మందికి పైగా ఇళ్ళు కట్టుకొని, 11 మందికి పైగా కోటీశ్వరులు కావడానికి కూడా కారణమైందీ యంత్రం.

అసలు చేనేత వృత్తే వద్దు, ఇది వదులుకొని పట్టణం వెళ్ళిపోదాం అనుకున్న వాళ్లు, వెళ్ళిన వాళ్ళు తిరిగి వచ్చి నిలదొక్కుకొని తమ వ్యాపారాలు అభివృద్ధి చేసుకొని పిల్లలను ఉన్నత చదువులు చదివించి, ఆర్థికంగా, సామాజికంగా కూడా ఉచ్చ స్థాయికి ఎదగేందుకు కారణమైందీ యంత్రం.

చేనేత పని చేసే వారింటికి మా ఆడపిల్లను ఇవ్వము అనుకున్న వాళ్ళు ఇప్పుడు ఆనందంగా మా సంబంధం చేసుకోండి అనే

పరిస్థితులు వచ్చాయి. ఆడపిల్లలు కూడా ఆనందంగా మక్కువతో పద్మశాలుల ఇంట అడుగు పెట్టడానికి కారణమైందీ యంత్రం.

కొన్ని వేల మంది చేనేత వృత్తి మానేసి పట్టణాలకు వలస పోయి, ఆటో, ట్యాక్సీ డ్రైవర్లుగా, భవన సముదాయాలకి వాచ్‌మెన్లుగా పని చేసిన వారు అనేక మంది తిరిగి వారి స్వంత ఊరికి చేరి, తిరిగి తమ వంశ పారంపర్యమైన ఈ వృత్తి చేపట్టి సంతృప్తిగా జీవించటానికి కారణమైందీ యంత్రం.

మగ్గాలు లేని పేద పద్మశాలీలు, ఏ ఆధారమూ లేని మహిళలు అనేకమంది కేవలం ఈ ఆసు యంత్రం సహాయంతో ఆసు పోసుకొని, మగ్గాలున్న వారికి సరఫరా చేయటం ద్వారా తాము బాగు పడటమే కాక, తాము ఏమి చెయ్యలో తెలియని పరిస్థితుల్లోనుంచి గట్టెక్కి, తమ పిల్లలకి కూడా చక్కని భవిష్యత్తుని, చదువుని అందించటానికి కారణ మైందీ యంత్రం.

వయస్సు మీరిపోయింది, ఇంక చేనేత పని చేయలేను అని ఈ వృత్తి మానేసిన వారు సైతం జీవితాంతం మగ్గం పని చేసుకుంటాను అని నిర్ణయించుకొని ముందుకు సాగటానికి కారణమైందీ యంత్రం.

భవిష్యత్తులో వ్యక్తులు ఒకప్పుడు మా పూర్వీకులు ఈ ఆసుని చేత్తో పోసేవారట! అనేలా సమాజాన్ని మార్చివేయటానికి కారణమైందీ యంత్రం.

మన దేశ ప్రధాని ప్రతి నెలా మాట్లాడే 'మన్ కీ బాత్' లో అలాగే విదేశాలలో వివిధ దేశాధినేతల సమక్షంలోదేశంలో చేనేత రంగంలో జరుగుతున్న విప్లవానికి 'చింతకింది మల్లేశం' లాంటి యువత కల దేశమని గర్వంగా ప్రస్తావించడానికి కారణమైందీ యంత్రం.

మల్లేశంను మన దేశ పూర్వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారితో







ఒకే టేబుల్ మీద కూర్చొని అల్పాహారం సేవిస్తూ ఆయనతో సంభాషించ టానికి కారణమైందీ యంత్రం.


ప్రపంచ చరిత్రలోనే ఒక పునాది స్థాయి ఇన్నోవేటర్ రూపొం దించిన ఒక యంత్రం, దానికతను పడ్డ కష్టాలను హృద్యమంగా వెండి తెరపైకి ఎక్కించడానికి కారణమైందీ యంత్రం.

ప్రతిష్ఠాత్మకమైన 'టెడ్ టాక్' ఇవ్వటానికి, 2009 లో రాష్ట్రపతి చేతుల మీదుగా ఎన్ఐఎఫ్ వారి అత్యుత్తమ ఇన్నోవేటర్ పురస్కారాన్ని అందుకోవటానికి, భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా 'అమేజింగ్ ఇండియన్' పురస్కారం అందుకోవటానికి, భారత దేశం ప్రతిష్ఠాత్మకంగా అందజేసే 'పద్మశ్రీ' పురస్కారం 2017లో అందుకోవ డానికి కూడా కారణమైందీ యంత్రం.

తనకింత పేరు ప్రఖ్యాతులు, గౌరవ ప్రతిష్ఠలు రావటానికి, అంతర్జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు రావటానికి కారణం తాను 2008లో 'పల్లెసృజన' సంపర్కం లోకి రావటం, దాని మార్గదర్శకత్వం లోనే ఇవన్నీ సాధించగలగడం తన పూర్వజన్మ సుకృతం అంటాడు చింత కింది మల్లేశం. ఈ కోవలోనే ఎన్నో పద్మశ్రీలను చూస్తామన్న ఆశతో ఉంది పల్లెసృజన.

## 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత మన ఇన్నోవేటర్ "చింతల వెంకట్ రెడ్డి" గారికి దక్కిన మరో అరుదైన గౌరవం

భారత ప్రధాని నరేంద్ర మోదీ గారు 'మన్ కీ బాత్' అనే కార్యక్రమం ద్వారా ఆలిండియా రేడియోలో ప్రసంగిస్తున్న సంగతి పాఠకులకు విదితమే.






ఈ ప్రసంగాలు 100 ప్రసారాలు పూర్తయిన సందర్భంగా భారత ప్రభుత్వం వీటిలో కొన్ని ప్రత్యేకమైన వాటిని సేకరించి ఒక పుస్తక రూపం లో ప్రచురించటం జరిగింది. ఆ పుస్తకంలో మన ఇన్నోవేటర్ మట్టి మనిషి, 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత 'చింతల వెంకట్ రెడ్డి' గారిని గురించి ప్రస్తావించటం, వారి కొరకు రెండు పూర్తి పేజీలు కేటాయించటం వారితో పాటు మన 'పల్లెసృజన' కుటుంబ సభ్యులకు కూడా ఎంతో ఆనందదాయకం. ఈ సందర్భంగా చింతల వెంకట్ రెడ్డి గారికి అభినందనలు తెలియజేస్తోంది 'పల్లె సృజన'. ఈ పుస్తకం ద్వారా మన ఇన్నోవేటర్ కీర్తి విశ్వ వ్యాప్తమయినట్లయింది.

# వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా అభివృద్ధి చేయబడ్డ 'శారీ రోలింగ్ యంత్రం'





కడప జిల్లా, ప్రొద్దుటూరుకు చెందిన ఇన్నోవేటర్ 'గోరెంట్ల శివచంద్ర ప్రసాద్' మహిళలు ఇంట్లోనే ఉంటూ తీరిక సమయాల్లో స్వయం ఉపాధి పొందేలా తక్కువ శ్రమతో, నాణ్యత కలిగిన "చీరల రోలింగ్" యంత్రం తయారు చేసిన విషయం గత సెప్టెంబర్–అక్టోబర్, 2022 సంచికలో ముద్రించిన విషయం పాఠకులకు విదితమే. కేవలం తన ఆలోచనతో చీరల రోలింగ్‌ను చేతితో ఎక్కువ శ్రమపడి చేయాల్సిన అవసరం లేకుండా, ఎక్కువ మంది కష్టపడి పని చేయాల్సిన అవసరం లేకుండా కేవలం ఒకే ఒక్కరు మాత్రమే ఈ యంత్రంతో చీరలను ఎక్కువ నాణ్యతతో రోలింగ్ చేసే యంత్రాన్ని కనుగొని, ఎంతోమంది మహిళలకు దాదాపు కొత్త చీరలా కనిపించేలా చీరలను రోలింగ్ చేసి ఇస్తున్నాడు.

దీన్ని చూసిన కొందరు మహిళలు తమకూ ఇటువంటి యంత్రం చేసి ఇవ్వమని అడగటం జరిగింది. అందుకు అంగీకరించిన శివచంద్ర ప్రసాద్ తాను చేసుకన్నట్లుగానే ఇతరులకూ ఇలాగే యంత్రం తయారు చేసి ఇవ్వటం వల్ల వాళ్ళ ఇంట్లో చిన్న పిల్లలు ఉన్నా, లేదా రోలింగ్ చేసే మహిళలకు కూడా కొంత అసౌకర్యంగా ఉంటుందని భావించి, తాను చేసిన యంత్రాన్ని ఇంకా అభివృద్ధి చేసి, ఎక్కువ నాణ్యతా ప్రామాణాలతో అభివృద్ధి చేసి, యంత్రం చూడటానికి కూడా కొత్తదిగా అనిపించేలా తయారు చేశాడు. ఈ యంత్రం చూసే వారికి నాణ్యంగా కనిపించటంతో పాటు, భద్రతా ప్రమాణాలను కూడా పెంచారు. ఈ యంత్రంలోని మోటారు, చక్రాలు, బెల్టుల వల్ల పని చేసే మహిళలు మరియు వారి పిల్లలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా వాటిని పూర్తి కప్పివేయటం జరిగింది. గతంలో తాను చేసుకున్న యంత్రానికి మోటారు, బెల్టులు, చక్రాలు అన్నీ పైకి కనిపించేవి. ఇప్పుడు అలాంటివేవీ పైకి కనిపించవు.





**వ్యతిరేక దిశలో తిరిగే చతురస్రాకకార రోలర్ (రివర్స్ పంటె):**

పాత మాడల్ యంత్రంలో ఈ సౌకర్యం లేదు. కొన్ని చీరలకు కొంగు చివరలో అందంగా కనిపించటానికి గంటలు, పూసలు వంటి వాటితో చేతిపని చేయించుకుంటూ ఉంటారు మహిళలు. అలాంటి వాటిని రోలింగ్ చేయడానికి యంత్రం ముందు నుండి కాకుండా వెనక నుండి అంటే రివర్స్ పద్ధతిలో రోలింగ్ చేయాల్సి ఉంటుంది. ఆ విధంగా



చేయాలంటే ఇద్దరు వ్యక్తులు అవసరం అవుతారు. ఈ క్రొత్త యంత్రంలో ఇద్దరు పని చేయాల్సిన అవసరం లేకుండా ఒక్కరే చీరను రోలింగ్ చేయుటకు 'రివర్స్ పంటె'ను ఏర్పాటు చేయటం జరిగింది.

**వెడల్పుగా చీరను శుభ్రం చేయటం (ఓపన్ విడ్త్ వాషింగ్):**

ఈ సౌకర్యం పాత యంత్రంలో లేదు. దానివల్ల కూడా కొంత సమయం వృధా అవుతుందని గ్రహించి ఈ నూతన యంత్రంలో ఈ ఏర్పాటు చేశాడు. ఇప్పుడు మార్కెట్లో వస్తున్న చీరలు అన్ని దాదాపు వాష్ చేసేటపుడు రంగులు వెలసి ఒక చీర రంగు ఇంకో చీరకు అంటుకుంటూ ఉంటాయి. అలా జరగకుండా ఈ యంత్రంలో ఒక మంచి పరిష్కారం చూపాడు శివచంద్ర ప్రసాద్. ఈ సౌకర్యం ఏర్పాటు చేయటం వల్ల కొత్త చీరలు లేదా రంగులు వెలిసే ప్రమాదం వున్న చీరలను వెడల్పుగా యంత్రానికి అమర్చి, అక్కడక్కడా చేతితో కుట్టు వేసి (మళ్ళీ విప్పడానికి అనువుగా వుండేలా) యంత్రంలో త్రిప్పటం వల్ల చీరలోని రంగులు ఒకదాతో ఇంకో చీర రంగు అంటుకోకుండా బాగా వాష్ చెయ్యవచ్చు. వాష్ చేసిన తర్వాత చీరను ఆరబెట్టి అదే మిషనులో రోలింగ్ లేదా పాలిష్ చెయ్యవచ్చు. ఇది మహిళలకు బాగా ఉపయోగపడే ఒక కొత్త అభివృద్ధి అంటాడు శివచంద్ర ప్రసాద్.

కొత్తగా అభివృద్ధి చేసిన యంత్రాన్ని తిరుపతిలోని ఒక మహిళా సమూహానికి ఇటీవలే విక్రయించటం జరిగింది. ఈ యంత్రంతో ఆ మహిళలు తక్కువ శ్రమతో, ఎక్కువ నాణ్యతతో చీరలను రోలింగ్ చేసి వారి చుట్టు ప్రక్కల ప్రాంత మహిళల్లో మంచి పేరు సంపాదించుకుని, అధిక ఆదాయం పొందుతున్నారు. పట్టణాల్లో అధికంగా అపార్ట్‌మెంట్ల సంస్కృతి పెరుగుతున్నది కావున అలాంటి ప్రాంతాల్లో వున్న మహిళలు ఈ యంత్రాన్ని కొనుగోలు చేసుకుంటే తమ తీరిక సమయాల్లో తక్కువ శ్రమతో, ఎంతో శుభ్రంగా, నాణ్యతతో కూడిన చీరలను రోలింగ్ చేసి అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

తన యంత్రానికి తానే నాణ్యతా ప్రమాణాలను పెంచేలా, చూపరులకు ఆకర్షణీయంగా కనిపించేలా, రోలింగ్ చేసే మహిళలు కూడా శుభ్రంగా చీరలు రోలింగ్ చేసేలా యంత్రాన్ని అభివృద్ధి చేసిన శివచంద్ర ప్రసాద్‌ను అభినందిస్తోంది 'పల్లెసృజన'. ●

**ఇన్నోవేటర్ : శివచంద్ర ప్రసాద్, ఫోన్ : 96422 49555**

## సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత 18 సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. అంతే కాక పునాది స్థాయి ఇన్నోవేషన్లు ఎన్నో అందుబాటులోకి రావటం, గ్రామాల్లోనే ఎంతోమందికి ఉపాధి లభించటం జరిగింది.

గత 18 యేళ్ళ ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం. ఈ ప్రయత్నంలో మీ సమస్యలను మీవద్దనుండి సేకరిం చాలని నిర్ణయించుకున్నాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము. -ఎడిటర్

వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700

# ఆయుర్వేద జ్ఞాన మధనం

## ఇంటి వైద్యం ఎంతో మేలు



ఉమా మహేశ్వర రావు

**45 సం.ల వయసు పైబడ్డ మహిళలకు ఇంటి వైద్యం:**

సాధారణంగా 45–50 సంవత్సరాల పైబడ్డ మహిళలకు ఋతు క్రమం ఆగిపోతుంది. వారికి వచ్చే ప్రధాన సమస్యల్లో మూత్ర విసర్జనలో మంటగా ఉండటం, తడి ఆరిపోవటం లాంటి సమస్యలు చాలా మందికి ఉంటాయి. ఈ సమస్యలను బయట చెప్పుకోలేక, డాక్టరు వద్దకు కూడా వెళ్ళి చెప్పుకోలేక లోలోపలే బాధ పడుతూ ఆ సమస్యలను భరిస్తూ ఉంటారు. అటువంటి వారికి అద్భుతమైన ఇంటి వైద్యంతో చాలా వరకు సమస్యలు తీరిపోతాయి. వీరు చేయవలసిందల్లా ఒక్కటే. ఉసిరి కాయలను ఎండబెట్టి బాగా ఎండిన తర్వాత వాటిని పొడి చేసి అందులో కొద్దిగా బెల్లం కలుపుకుని ఒక సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతి రోజూ ఉదయం సాయంత్రం ఒక చెంచాడు పొడిని, రాత్రి భోజనం చేసిన తర్వాత పడుకునే ముందు ఒక చెంచాడు పొడిని నీటిలో కలుపుకుని తాగితే చాలు ఈ సమస్యల నుండి తొందరగా బయట పడతారు. ఇటువంటి మహిళలు ఆహారం విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వీరి ఆహారంలో రాజ్మా, ముల్లంగి, క్యాబేజి, కొబ్బరి, పాలు కాస్త ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇలా చేస్తే యోనిలో మంట, తడారి పోవటం లాంటి సమస్యల నుండి చాలా త్వరగా ఉపశమనం పొందుతారు.

తర్వాత ఇటీవల చాలా మందికి 'లివర్' సమస్యలు పెరిగి పోతున్నాయి. ఈ సమస్య నుండి బయట పడటానికి ఎన్నో రకాల మందులు ఉపయోగించే బదులు ఆహారంలోనే కొద్దిగా జాగ్రత్తలు తీసుకుంటే లివర్ సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. ఇటువంటి వారు చేయవలసిందల్లా తమ ఆహారంలో కొన్నింటిని కాస్త ఎక్కువగా ఉండేలా చూసుకుంటే మంచిది. అవేమిటంటే..... వీలైనంత వరకు వీరు ఆహారంలో ఉపయోగించే వంట నూనెలను బజార్లో కొనుక్కోవటం కన్నా, గానుగ నూనె ఉపయోగిస్తే మంచిది. అలాగే పసుపు, కారం కూడా బజార్లో నేరుగా పొడర్లను కొనుగోలు చేయకుండా, ఎండు మిరప కాయలు, పసుపు కొమ్ములు కొనుక్కొని వాటిని పిండి పట్టించుకుంటే మంచిది. టీ, కాఫీలు తాగేటపుడు అందులో కొద్దిగా దాల్చిన చెక్క పొడిని వేసుకుంటే మంచిది. ఏప ఉల్లిపాయలు అని మార్కెట్‌లో దొరుకుతాయి, వాటిని తెచ్చుకొని రోజూ రెండు మూడు పాయలను అన్నంలో ఉడికించుకొని తిన్నా లేదా నేతిలో వేయించుకుని తిన్నా కూడా మంచిది. నిమ్మరసం, టమోట, బొప్పాయిలను ఎక్కువగా వాడినట్లయితే లివర్ సమస్యల నుండి దూరంగా కావచ్చు.

ఆ తర్వాత ఇటీవల చిన్న వయసు వారికి కూడా గుండె జబ్బు వచ్చే వారి సంఖ్య అధికమౌతోంది. అందుకే ప్రతి ఒక్కరూ రోజూ ఉదయమే గోరువెచ్చని నీరు ఒక గ్లాసు సేవిస్తే మంచిది. కొందరు మల విసర్జనలో చాలా ఇబ్బంది పడుతూ ఉంటారు. కొందరు ముక్కి ముక్కి మల విసర్జన చేస్తూ ఉంటారు. అటువంటి వారికి గుండె జబ్బులు త్వరగా వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి వీరు వారానికి ఒకసారి ఒక చెంచాడు ఆముదంలో కొద్దిగా అల్లం రసం కలుపుకొని తీసుకుంటూ ఉంటే మల విసర్జన సాఫీగా జరుగుతుంది. మల విసర్జన సాఫీగా జరుగుతూ ఉన్నట్లయితే గుండె జబ్బులు వచ్చే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయి. తర్వాత బీన్స్‌ను నీటిలో మరిగించుకుని కషాయం లాగా తయారు చేసుకుని తాగుతూ ఉన్నట్లయితే రక్త ప్రసరణ సాఫీగా జరిగి గుండెపైన వత్తిడి పడకుండా ఉంటుంది. నువ్వులు, వేరుశనగ విత్తనాలు, కొబ్బరి, మినుములు, మెంతులు ఆహార పదార్థాల్లో ఎప్పుడూ ఉండేలా చూసుకుంటే మంచిది.

ఇక ఇటీవల ఆహార పదార్థాలలో ఉపయోగించే రసాయనాల వల్ల అజీర్ణం కూడా బాగా పెరిగిపోతోంది. ఆహారం త్వరగా జీర్ణం అయినట్లయితే చాలా వరకు రోగాలు దరిచేరవు. తిన్న ఆహారం సాఫీగా జీర్ణం కాకుంటే పొట్ట ఉబ్బటం, అసౌకర్యంగా ఉండటం లాంటివి కనబడుతూ ఉంటాయి. ఇటువంటి వారు 'వాము, ఉప్పు, జీలకర్ర, ఇంగువ' ఈ నాలుగింటిని కొద్దిగా పెనంపైన వేయించుకుని, పొడి చేసి పెట్టుకుని ఒక సీసాలో భద్రపరచుకొని, సమస్యను బట్టి రోజూ లేదా రెండు మూడు రోజులకోసారి ఒక చెంచాడు పొడిని మజ్జిగలో కలుపుకుని త్రాగుతూ ఉన్నట్లయితే అజీర్తి సమస్యల నుండి ఉపశమనం పొందుతారు.

కొందరిలో అతిమూత్ర వ్యాధిగ్రస్తులు కూడా ఉంటారు. రాత్రిపూట మూడు నాలుగు సార్లు మూత్ర విసర్జనకు వెళ్ళే వాళ్ళు కూడా ఉంటారు. అటువంటి వారికి రాత్రుళ్లు నిద్ర సరిగా పట్టక అదేపనిగా మూత్ర విసర్జనకు వెళుతూ ఉంటారు. అటువంటి వారు 'నేల ఉసిరి' చెట్టును 'ఆకులు, పూవులు, కాయలు, వేర్లతో సహా' సమూలంగా తెచ్చుకొని, నీడలో బాగా ఆరబెట్టుకొని పొడి చేసి ఉంచుకుని, అందులో పటిక బెల్లం కొద్దిగా కలుపుకుని రోజూ ఒక చెంచాడు పొడిని నీటిలో లేదా మజ్జిగలో కలుపుకుని త్రాగుతూ ఉన్నట్లయితే మధుమేహం ఉన్న వారికి కూడా అతిమూత్ర వ్యాధి తగ్గిపోతుంది.

ఇటీవల కొందరికి అరిచేతులు, అరికాళ్ళు మంటలుగా ఉన్నాయని చాలా మంది చెబుతున్నారు. అటువంటి వారు లేత దొండకాయలను తీసుకుని రసంగా తయారు చేసుకుని మజ్జిగలో కలుపుకుని త్రాగుతూ ఉండాలి. అలాగే దొండ ఆకులను రసంగా చేసుకుని, ఆ రసాన్ని అరిచేతులు, అరి కాళ్లకు పూసుకుంటూ ఉన్నట్లయితే అరిచేతులు, అరికాళ్ళ మంటలు త్వరగా తగ్గుతాయి.

కొందరు విపరీతమైన అలసటకు గురవుతూ ఉంటారు. అటువంటి వ్యక్తులు ఏసీ రూముల్లో ఉన్నా సరే విపరీతంగా అనిశ్చితికి, అసహనానికి గురవుతూ ఉంటారు. అటువంటి వారు మార్కెట్‌లో లభించే నారింజ (బత్తాయి, కమలా పండ్లు కాదు) పండ్లను తెచ్చుకుని వాటి రసాన్ని తీసుకుని అప్పుడప్పుడూ మజ్జిగలో కలుపుకుని త్రాగుతూ ఉన్నట్లయితే ఎప్పటికీ ఆ సమస్య ఉత్పన్నం కాదు.

పైన తెలిపిన ఈ సమస్యల నుండి దూరం కావటానికి ఎంతో మంది డాక్టర్ల వద్దకు వెళ్ళి అనేక రకాల మాత్రలు వేసుకునే బదులు ఇంటి వైద్యంతో ఈ విధంగా చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం.: 9440286854

# ప్రకృతిలో లభించే మొక్కలతో వైద్య చిట్కాలు

**"నులి పురుగులు" నివారణకు వైద్య చిట్కాలు:**

సాధారణంగా చిన్న పిల్లల్లో ఎక్కువగా 'నులి పురుగులు' కడుపులో ఏర్పడటం వల్ల వాళ్ళకు అన్నం సరిగ్గా అరగక, బేదులు పెట్టి, మలంలో సన్నటి పురుగులు పడుతూ ఉంటాయి. అటువంటి పిల్లలు ఎదగరు. ఈ సమస్య పశువులలో కూడా అప్పుడప్పుడూ వస్తూ ఉంటది. వీటి నివారణకు కొన్ని చిట్కాలు ఇక్కడ వివరిస్తున్నాము.

లేత వేప ఆకులు ఒక అర గుప్పెడు తీసుకుని వాటిని రోట్లో వేసి లేదా ఒక గుండ్రాయితో కాస్త కచ్చకచ్చ దంచాలి. (మరీ మెత్తగా దంచ వలసిన అవసరం లేదు) ఆ తర్వాత ఒక పాత్రలో ఒక గ్లాసు నీటిని తీసుకుని ఈ ఆకు ముద్దను అందులో వేసి, ఆ నీరు సగం అయ్యేంత వరకు పొయ్యిమీద వేడి చేసి కషాయం తయారు చెయ్యాలి. అలా తయారైన కషాయాన్ని రోజూ ఉదయం అర గ్లాసు 21 రోజుల పాటు త్రాగితే కడుపులో వున్న నులి పురుగులు అన్నీ నశించి, మనిషి ఆరోగ్యంగా ఉంటాడు.

మధుమేహం (షుగర్) ఉన్న వాళ్ళు కూడా ఈ కషాయాన్ని సేవిస్తూ ఉన్నట్లయితే రోగం పెరగకుండా అదుపులో ఉంటుంది.

నులి పురుగుల నివారణకే మరో ఔషధం – నేరేడు పండ్లను కానీ, బాగా పండిన వేప పండ్లను కానీ తింటూ ఉన్నట్లయితే కడుపులో వున్న నులి పురుగులు నివారణతో పాటు, సరిగ్గా అరుగుదల లేని వారికి, ఎప్పుడూ తిన్నది సరిగ్గా అరగక, పుల్లటి తేపులు వస్తూ వున్న వారికి ఈ పండ్లను తినటం వల్ల ఆ బాధల నుండి విముక్తి పొందవచ్చు.

నేల ఉసిరితో కూడా నులి పురుగులను నివారించవచ్చు. 'నేల ఉసిరి' మొక్క సమూలంగా (కాయలు, ఆకులు, వేర్లతో సహా) తీసుకుని, మంచి నీటిలో మొక్కను బాగా శుభ్రంగా కడిగి, రోట్లో వేసి కొద్దిగా కచ్చ కచ్చగా దంచి పైన చెప్పినట్లుగానే దీన్ని కూడా ఒక గ్లాసు నీటిలో వేసి, అరగ్లాసు అయ్యేంత వరకు వేడి చేసి కషాయం చేసుకుని త్రాగినచో నులి పురుగుల నుండి ఉపశమనం పొందచవచ్చు.

నులి పురుగుల నివారణకే మరో పద్ధతి – గ్రామాల్లో 'రేల' చెట్లు ఉంటాయి, వాటి కాయలు మునక్కాయల లాగా పొడవుగా ఉంటాయి (క్రింద బొమ్మలో చూడవచ్చు). ఆ కాయలను తీసుకుని పైన తొక్కలు తీసినట్లయితే లోపల విత్తనాలతో కూడాన గుజ్జు ఉంటుంది. ఆ గుజ్జును నీటిలో వేసి బాగా కలిపిన తర్వాత వడబోసినట్లయితే విత్తనాలన్నీ పక్కకు వస్తాయి. ఆ రేల కాయలు కలిపిన నీటిని త్రాగినచో నులి పురుగులు నివారించ బడతాయి. ఈ ద్రావణం కాస్త తియ్యగా ఉంటుంది కాబట్టి ఎవ్వరైనా సులభంగా త్రాగవచ్చు.


రేల చెట్టు, కాయలు, పూత, బెరడు


'వైద్య' కొమెర జాజి

రేల చెట్టు పూలు వచ్చగా ఉంటాయి. వాటిని సేకరించి, వాటితో పచ్చడి లేదా పెసర పప్పులో వేసుకుని వండుకుని తిన్నట్లయితే ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. అయితే ఈ పూత చలికాలంలో మాత్రమే లభిస్తుంది. మిగతా సమయాల్లో రేల చెట్టు లేత ఆకులను కూడా ఈ విధంగా వండుకుని తినవచ్చు. ఇలా తీసుకున్నా, నులి పురుగుల నుండి ఉపశమనం పొంద వచ్చు.

**పొడి దగ్గు నివారణకు చిట్కా:**

పొడి దగ్గు నివారణకు 'అతిమధురం' మొక్క వేర్లను తీసుకుని, వాడిని ఎండబెట్టుకుని, జేబులో ఉంచుకుని కొద్దిగా చిన్న ముక్కను నోట్లో వేసుకుని అలాగే (వక్కలాగా) ఉంచుకుని కొద్ది కొద్దిగా నోట్లో ఊరే లాలాజలం రసాన్ని మింగుతూ ఉన్నట్లయితే పొడి దగ్గు నివారించ బడుతుంది.

పొడి దగ్గు నివారణకు మరో ఔషధం – తంగేడు చెట్టు వేరును తీసుకుని, పైన చెప్పినట్లుగానే ఎండ బెట్టుకుని ఆ వేరు ముక్కను నోట్లో వేసుకుని లాలాజలం మింగుతూ ఉన్నా కూడా పొడి దగ్గు నివారించుకోవచ్చు.

తులసి ఆకులను తీసుకుని, వేడి నీటిలో వేసుకుని, కొద్దిసేపు అయిన తర్వాత ఆ నీటిని త్రాగినా కూడా పొడి దగ్గు నుండి నివారణ పొందవచ్చు.

లవంగాలను తీసుకుని పెనంపైన పెట్టి దోరగా వేయించి, పొడి చేసి పెట్టుకుని, ఒక చిటికెడు పొడిని శుభ్రమైన తేనెలో వేసుకుని నాకినట్లయితే పొడి దగ్గు నివారించ బడుతుంది.

ఉత్తరేణి చెట్టును సమూలంగా వేర్లతో సహా తీసుకుని, నీటిలో శుభ్రంగా కడిగి, నీడన ఆ తడి ఆరిపొయ్యేదాకా ఆరబెట్టి తర్వాత ఆ మొక్కను చిన్న చిన్న ముక్కలుగా చేసి, బాగా ఎండబెట్టాలి. ఒట్టిగా అయిన తర్వాత ఒక బండను శుభ్రం చేసుకుని ఆ బండపైన ఈ ముక్కలను వేసి తగలబెట్టి బూడిద తయారు చేసుకోవాలి. బూడిన చల్లారిన తర్వాత మెత్తటి గుడ్డలో లేదా సన్నటి జల్లెడలో ఆ బూడిన వేసి జల్లి పట్టినట్లయితే మెత్తటి బూడిద వస్తుంది. ఆ బూడిదను చిన్న పిల్లలకు ఐతే ఒక పావు స్పూను, పెద్దవాళ్ళు అయితే ఒక స్పూను తీసుకుని, తేనెలో రంగరించి ఆ తేనెను నాలుకపై బాగా రంగరించి పూసి, చప్పరించినట్లయితే పొడి దగ్గు నివారింప బడుతుంది.

పైన చెప్పిన వైద్యాలన్నీ మీ ఇంటి చుట్టు ప్రక్కల లేదా మీ గ్రామంలో లభించేవే కాబట్టి ఈ వైద్యాలను మీరే స్వయంగా చేసుకుని, పొడి దగ్గు, నులి పురుగులను మీకు తోచిన, అందుబాటులో వున్న ఏదో ఒక వైద్యం మీరే స్వయంగా చేసుకుని ఆరోగ్యంగా ఉండండి. అనవసరంగా చిన్న చిన్న రోగాల కొరకు డాక్టర్ల చుట్టూ తిరిగి ధనాన్ని వృధా చేసుకోకండి. ●

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రవే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం. : 9908411700

# 'సదాప' మొక్కతో ఆరోగ్య ప్రయోజనాలు

'సదాప' మొక్కను కొన్ని ప్రాంతాల్లో 'అరుద', 'రుయె' అని కూడా పిలుస్తుంటారు. ఇది మూడు అడుగుల వరకు పొదలాగా యెదిగే మొక్క. మంచి సుగంధ వాసన కలిగి ఉంటుంది, ఘాటైన వాసన కలిగి ఉంటుంది. దీన్నే వెయ్యిపూల మొక్క అని కూడా అంటారు. ఇది పసుపు పచ్చని పూలు పూస్తుంది. చిన్న చిన్న కాయ లాంటి విత్తనాలను కలిగి ఉంటుంది. ఘాటైన వాసన కలిగిన, మంచి ఔషధ గుణాలు కలిగి మొక్క ఈ సదాప. ఈ మొక్క గురించి తెలియని వారు పువ్వులు అమ్మే వారు ఎవరినైనా అడిగితే వారు ఈ మొక్కను గురించి చెబుతారు. ఈ మొక్క చాలా వరకు నర్సరీలలో కూడా లభిస్తుంది. ఇంట్లో, పెరట్లో ఈ మొక్కను పెంచుకోవచ్చు.

శరీరంలోని నొప్పులను వాటిని తగ్గించటానికి, క్యాన్సర్ వల్ల కలిగిన గాయం యొక్క నొప్పుల నుండి కాపాడటానికి ఉపయోగ పడు తుంది. జ్వరాన్ని తగ్గిస్తుంది, నీరసాన్ని తగ్గిస్తుంది, పొడిదగ్గు, ఆయాసం లను తగ్గిస్తుంది. ఈ మొక్కను చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు అందరూ ఉపయోగించుకోవచ్చు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లు రావు.

కొందరు చిన్న పిల్లలు ఎగబొస పెడుతూ చాలా ఆయాస పడుతుంటారు. అటువంటి వారికి సదాప మొక్క యొక్క రెండు మూడు ఆకులను తీసుకుని చనుపాలలో నలిపి వారికి తాగించినట్లయితే వారిలో ఎగపోత, ఆయాసం, ముక్కుల్లో ఎక్కువగా నీరు కారటం లాంటి లక్షణాలను బాగా తగ్గిస్తుంది. చనుబాలను ఒక చిన్న శంఖంలో పిండుకుని, అందులో రెండు లేదా మూడు ఆకులను నలిపి ఆ రసాన్ని పాలల్లో వేసి, పిల్లలకు తాగించాలి. ఇలా చేస్తే వర్షాకాలం, చలి కాలంలో పిల్లలకు ముక్కుల్లో నీరు కారుతూ, ఆయాసంగా ఉన్న వాళ్ళకు శరీరం లోపలే 'కళ్లె' గట్టిబారిపోయి, ముక్కుల్లోనుంచి నీరు రావటం ఆగిపోతుంది. ఇలా రెండు మూడు రోజులు చేస్తే చాలు. అలాగే ఈ ఆకు రసం కలిపిన పాలను చిన్నపిల్లల పొట్ట పైభాగంలో ఉండే ఎదలపైన, బ్రెముకల పైన పూసి మర్దన కూడా చేస్తే ఊపిరి తిత్తుల్లో వున్న దోషాలను తొలగిస్తుంది.



బాల నర్సయ్య, నల్గొండ జిల్లా

పెద్దలు ఈ ఆకులో కొద్దిగా ఉప్పు, వాము, ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బలు ఈ నాలుగు అరచేతిలో వేసుకుని బొటన వేలితో బాగా నలిపి బఠాని గింజ పరిమాణంలో మాత్రలాగా చేసుకుని నోట్లో దవడకు పెట్టుకుని చప్పరిస్తూ వచ్చే రసాన్ని మింగుతూ ఉండాలి. ఇలా చేయటం వల్ల పొడిదగ్గు, గొంతులో నొప్పి, గొంతులో ఇన్‌ఫెక్షన్, గొంతులో నొప్పి ఉండి ఏమీ మింగలేని పరిస్థితి ఉన్నవాళ్ళకు త్వరగా ఉపశమనం లభిస్తుంది. గొంతులో నుండి అదేపనిగా గళ్ళ పడుతున్న వారికి తగ్గిపోతుంది. దీని వల్ల ఆయాసం, జ్వరం లాంటి రోగాలను కూడా నయం చేస్తుంది. ఇది శీతాకాలంలో వచ్చే రోగాల వల్ల మంచి ఉపశమనం ఇచ్చే ఔషధం. ఆస్తమా జబ్బు ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

ఈ సదాప మొక్క ఆకులను తగినన్ని సేకరించి, వాటిని నీడన ఆరబెట్టుకొని పొడి చేసుకొని గాజు సీసాలో భద్రపరచుకొని, చిన్న పిల్లలకు జలుబు ఆయాసం లాంటివి వచ్చినపుడు ఒక చెంచాడు పొడిని పాలలో కలిపి ఇస్తే చాలా బాగా పని చేస్తుంది.

సదాప ఆకులను సేకరించి, ఒక పాత్రలో వేసి, అవి మునిగేంత వరకు కొబ్బరినూనె వేసి, పొయ్యిమీద సన్నటి మంటతో ఆకులలోని ఔషధ గుణాలు నూనెలో కలిసిపోయేలా బాగా మరిగించాలి. అది చల్లారిన తర్వాత ఆకులు తీసివేసి, నూనెను ఒక సీసాలో భద్రపరచు కోవాలి. ఈ నూనెను ఊపిరి తిత్తులలో నిమ్ము ఉన్నవారు, సర్ది, సైనస్, ఆస్తమా వ్యాధి గ్రస్తులు ఎద భాగంలో మర్దనా చేసుకున్నట్లయితే ఊపిరి తిత్తులలోని నిమ్మును తీసివేసిం ఆరోగ్యంగ ఉండేలా చేస్తుంది. శరీరంలో నొప్పులు ఉన్నవారు, ఈ నూనెను నొప్పులు ఉన్నచోట మర్దనా చేసుకుంటే నొప్పులను గుంజివేస్తుంది.

ఈ నూనెను ఎన్ని రోజులైనా నిలువ ఉంచుకోవచ్చు. ఎలాంటి దోషము ఉండదు, నూనెలోని ఔషధ గుణాలు తగ్గవు. సదాప మొక్క ఆకులు పచ్చి ఆకులతో వైద్యం చేసుకున్నా, ఆరబెట్టి పొడి చేసుకుని వాడుకున్నా, నూనెలో మరిగించి వాడకున్నా దీని ఔషధ గుణాలు బాగా పని చేస్తాయి. కాబట్టి ఎవరికి వీలైనంతగా వారు ఈ ఆకులతో ఔషధాన్ని తయారు చేసుకుని ఇంట్లో భద్రపరచుకుంటే మంచిది. ●



'సదాప' మొక్క
దీన్నే 'అరుద', 'రుయె' అని కూడా పిలుస్తారు

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' బాల నర్సయ్య, ఫోన్ నెం.: 6303903400

**వీరరాఘవ రెడ్డి గారు,**

నమస్కారం. గత రెండు సంవతసరాల క్రితం మా 'చోహాన్ క్యూ & సివిఆర్ ' గారి వాట్సాప్ గ్రూపు సభ్యులందరం కలిసి దాదాపు 300 మంది వరకు మీరు చెప్పినట్లు సభ్యత్వం తీసుకున్నాము. కాన, పోస్టల్ శాఖ వారి అశ్రద్ధ వల్ల చాలా మందికి 'పల్లెసృన' పత్రిక అందటం లేదు. ఇప్పటికీ వెళ్ళి సంబంధిత పోస్టాఫీసులో అడిగినా సరియైన స్పందన ఉండటం లేదు. ఈ విషయాలను పల్లెసృన ఆఫీసులో చెబితే వారు స్వయంగా ఖర్చులు భరించి రిజిష్టర్ పోస్టులో పంపేవారు. కానీ మళ్ళీ సమస్య మొదటికే వస్తోంది. పల్లెసృజన పత్రికకు ఇన్ని వందల మందిని చేర్పించినాను కనుక నా విన్నపం ఏమంటే పత్రిక ప్రతి సభ్యునికి ఖచ్చితంగా చేరే మార్గం ఏదైనా ఉందేమో కాస్త గమనించి మాకు చెపితే, పల్లెసృజన పత్రికకు ఖచ్చితంగా ఇంకా కొన్ని వందల మందిని తప్పక చేర్పిస్తాను. ఒకసారి ఈ విషయం గురించి అందరికీ ప్రతినెల పత్రిక చేరుతోందా లేదా అని మీరు కూడా సమయం తీసుకొని విచారించ గలరు..... ఆ పరిష్కారం అందికీ తెలుప గలరు. ధన్యవాదములు.

**– శివశంకర్, చౌహాన్ & సివిఆర్ – వాట్సాప్ గ్రూపు అడ్మిన్,** ఫోన్ : 81210 08002

ఇది నూటికి నూరు శాతం నిజం. చందా కట్టినా ఒక్కటి కూడా అందలేదు. పోస్టలే కాదు ఆఫీసులో కూడా పర్యవేక్ష ఉండాలి. కొన్ని ధార్మిక పత్రికా సంస్థలు పంపుతున్న పత్రికలు వస్తున్నాయి. ఈ విషయంలో 'పల్లెసృజన' వెనకబడి ఉంది. ఇక పరిష్కారం 'పల్లెసృజన' చేయాలి. మన చేతుల్లో ఏమీ లేదు, వారి ఇష్టం.

**– రాంబాబు,** అనంతపురం జిల్లా. ఫోన్ : 83284 50292

మేము కూడా పత్రికకు చందా కడతాం. కానీ, ఈ సమస్యకు పరిష్కారం చూపండి.

**– నారాయణ రెడ్డి,** కొంపల్లి/ నిజామాబాద్. ఫోన్ : 93462 73691

పత్రిక చందా కట్టాము, కానీ, రావటం లేదు. **– చింతల నీలేష్,** ఫోన్ : 9492366830.

మేము 'పల్లెసృజన పత్రిక చందా కడతాం. పత్రిక పంప గలరు. **- మౌలాలి,** కదిరి. ఫోన్ : 94905 62614

**శివశంకర్, రాంబాబు, నారాయణ రెడ్డి, చింతల నీలేష్** మరియు **మౌలాలి** గార్లకు

'పల్లెసృజన' పత్రిక మనుగడ కోసం మీరు అందిస్తున్న ప్రోత్సాహానికి కృతజ్ఞతలు. మేము అభినందనలే కాదు, సద్విమర్శలను కూడా ఆనందంగా స్వీకరించి మా తప్పులను సరిదిద్దుకోవడానికి ఎప్పుడూ సిద్ధమే. మీకు కలుగుతున్న అసౌక ర్యానికి క్షంతవ్యులం.

'పల్లెసృజన' చందాదారుల లిస్టు ప్రకారం ప్రతి సంపుటిని పోస్ట్ చేస్తాము. ఈ లిస్టను ప్రతి వారం అప్‌డేట్ చేస్తాము. ఇందులో ఎటువంటి సందేశం లేదు.

గతంలో కూడా చాలామంది గౌరవ సభ్యులు మాకు ఫోన్ ద్వారా ఈ విషయం తెలుపగా, పోస్టల్ కార్యాలయానికి వెళ్ళి వారి అసౌకర్యాన్ని గురించి చర్చించగా, మీరు ఎవరెవరికి అంద లేదో వారి చిరునామాలు ఇవ్వండి, తప్పక చర్యలు తీససుకుం టాము అన్నారు. అలాగే మీరు రిజిష్టరు పోస్టు ద్వారా పంపిన ట్లయితే, ఇక్కడ పోస్ట్ చేసిన వెంటనే వారికి మెసేజ్ వెళ్తుంది. దాన్ని ట్రాక్ చేసి, పత్రిక ఎక్కడి దాకా వచ్చిందో, ఎందుకు రాలేదో తెలుసుకుని ఆన్‌లైన్ లోనే కంప్లయింట్ ఇవ్వవచ్చు. అలా రిజిష్టరు పోస్టు చేయాలంటే ఒక్కో పత్రికకు కనీసం రూ. 20/–లు అవుతుంది. మీరే ఆలోచించుకోండి అన్నారు. మీలాగే కంప్లయిం ట్ చేసిన వారికి మేము పత్రికలను మళ్ళీ పంపడం కూడా జరిగింది. ఈ గ్రూపులోని 33 మంది సభ్యులకు మూడు పత్రికలు పల్లెసృజన స్వంతఖర్చుతో రిజిష్టర్డు పోస్టు ద్వారా కూడా పంపడం జరిగింది.

శివశంకర్ గారు తన సివిఆర్ గ్రూపు సభ్యుల నుంచి 180 మంది రైతులను చందాదారులుగా చేర్చగా, వారిలో 27 మందికి 'పల్లెసృజన' పత్రిక అందలేదని తెలియజేశారు. సభ్యులు ఇబ్బంది పడకూడదు అని భావించి, వారికి రెండుసార్లు రిజిష్టర్ పోస్టు ద్వారా పత్రికను పంపడం కూడా జరిగింది.

ఈ విషయంలో మాకు తోచిన మార్గాలు రెండు. మొదటిది పోస్టాఫీస్ వారిని ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకొమ్మని తప్పక కోరతాం. రెండోది ఈ పత్రికలో ఎటువంటి వ్యాపార ప్రకటనలు ఉండవు, కేవలం ముద్రణా ఖర్చులు మాత్రమే తీసుకుని పత్రిక అందరికీ అందేలా చూస్తున్నాం. అందువల్ల మేము రిజిష్టరు పోస్టు యొక్క అదనపు ఛార్జీలు భరించే శక్తి మా(మీ) సంస్థకు లేదు. కాబట్టి ఏ సభ్యుడు అయినా అదనంగా రిజిష్టరు పోస్టు కొరకు రూ 240/–లు చెల్లించి నట్లయితే వారికి పత్రికను రిజిష్టరు పోస్టు ద్వారా పంప గలము. అంటే రెండు సంవత్సరలకు ప్రతి పాఠకుడు రూ. 640/–లు చెల్లిస్తే పత్రికను రిజిష్టరు పోస్టు ద్వారా పంపడం జరుగుతుంది.

ఈ విషయంలో చందాదారులకు మంచి జరగటం కోసం మీరు ఇచ్చే సలహాలను మేమెప్పుడూ ఆహ్వానిస్తాము.

మీకు కలుగుతున్న అసౌకర్యానికి మరోసారి క్షమాపణలు కోరుకుంటున్నాము.

**– వీరరాఘవ రెడ్డి, ఎడిటోరియల్ బోర్డు సభ్యులు, పల్లెసృజన.** ఫోన్ : 79890 38186 / 81257 99904.

# స్టాప్

## త్రిప్స్ నుండి మిరప పంటను కాపాడుతున్న సేంద్రియ పురుగు మందు



ఇన్నోవేటర్
**సంగబోయిన వెంకటకృష్ణ**
నంద్యాల జిల్లా,
ఆంధ్రప్రదేశ్

గత 4 సంవత్సరాలుగా ఉభయ తెలుగు రాష్ట్రల్లో మిరప పంటను 'ఆకు ముడత' (బొబ్బర/జెమిని వైరస్) ఆశించి పంటను నష్టపరుస్తోంది. వేలాది రూపాయల డబ్బు ఖర్చు చేసి, ఎన్ని రకాల రసాయ న మందు లు పిచికారి చేసినా ఆ తెగులు నయం కాక వేలాది ఎకరాల్లో చేతికి వస్తున్న మిరప పంటను దున్నేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని జిల్లాల్లో జరుగుతోంది. దయచేసి చేతికి రాబో తున్న పంటను తీసివేసి నష్టపోకండి.

'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన 'స్టాప్' అనే మందు రెడుసార్లు పిచి కారి చేస్తే వైరస్ అంతా పోయి, మంచి దిగబడి కూడా వచ్చినట్లు దాదాపు ఈ మందు వాడిన రైతులు అందరూ తెలియజేశారు. కొందరు పురుగు మందుల వ్యాపారం చేసే రైతులు కూడా మావద్ద వున్న ఎన్నో రకాల మందులు ఉపయో గించినా బొబ్బర తెగులు తీసివేయలేక పోయింది. కానీ, మీరు అందించిన మందు వల్ల చాలా బాగా ఫలితం వచ్చింది అని తెలియేశారు.

కాబట్టి రైతులందరికీ "పల్లెసృజన" చేస్తున్న విజ్ఞప్తి ఏమంటే. దయచేసి మీ పంటను తీసివేయకుండా ఒక్కసారి ఈ సేంద్రియ పురుగు మందులను వాడి చూడండి, మీ పంటను ఆశించిన జెమని వైరస్ నివారణతో పాటు, మంచి దిగుబడి కూడా సాధించవచ్చు.






వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.
సెల్ : 79890 38186, 96528 01700
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org
హనీబీ
NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555



# HRMN-99 ఆపిల్ మొక్కలు

## 48 డిగ్రీల ఎండలో కూడా ఆపిల్ పంట



ఇన్నోవేటర్
**హరిమాన్ శర్మ**
హిమాచల ప్రదేశ్,
రాష్ట్రపతి పురస్కార గ్రహీత

- హిమాచల ప్రదేశ్‌కు చెందిన రైతు హరిమాన్ శర్మ పరిశోధనలు చేసి ఆపిల్ 48 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉన్న ప్రాంతాల్లో కూడా పంట వచ్చే విధంగా మొక్కను అభివృద్ధి చేశాడు.
- ఇతను చేసిన సృజన (ఇన్నోవేషన్) 'హనీబీ నెట్‌వర్క్' ద్వారా వెలుగులోకి వచ్చింది.
- 2017 వ సం. 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.)' వారి 10వ ద్వైవార్షిక ఇన్నోవేషన్ & సాంప్రదాయ జ్ఞానం పోటీలలో 'రాష్ట్రపతి పురస్కారం'.
- ఎన్.ఐ.ఎఫ్. కొలాబరేటర్‌గా, హనీబీ నెట్‌వర్క్‌లో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో పనిచేసే 'పల్లెసృజన' ద్వారా మన తెలుగు రైతులకు ఈ మొక్కల పరిచయం.
- 'పల్లెసృజన' సౌజన్యంతో వీటిని 'పల్లె కిసాన్' మరియు 'క్రియేటివ్ మైండ్స్' సంస్థల ద్వారా సమాజానికి అందజేయడం జరుగుతోంది.
- ఈ 'హెచ్.ఆర్.ఎం.ఎన్.-99 ఆపిల్' రకం ఏ రకమైన పొలంలో నైనా సరే పెరిగి, 48 డిగ్రీల వరకు ఎండను కూడా తట్టుకుని దిగుబడి వస్తుంది.
- ఈ మొక్కలు ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో నమోదు చేసుకుని, డిశంబర్ మాసంలో రైతులకు సరఫరా చేయబడుతున్నాయి.
- గత 4 సంవత్సరాలుగా దాదాపు 15 వేలకు పైగా మొక్కలను రైతులకు అంద జేయడం జరిగింది. సరఫరా చేసిన వాటిలో 65 నుండి 95 శాతం మొక్కలు చిగురించి పెరుగుతున్నాయి.
- తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు అన్ని జిల్లాలకు సరఫరా చేయబడ్డాయి. కొందరి మొక్కలు పండ్లు కాయలు కాయటం, వాటి రుచి చూడటంతో ప్రస్తుతం రైతులు వినూత్నమైన యాపిల్ చెట్లు నాటేందుకు మొగ్గు చూపుతున్నారు.







వివరాలకు సంప్రదించండి
పల్లెసృజన
77, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.
సెల్ : 79890 38186, 96528 01700
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org
హనీబీ
NATIONAL INNOVATION FOUNDATION
E-mail : info@nifindia.org www.nifindia.org
Toll Free : 1800 233 5555

PALLE SRUJANA Telugu Bi-monthly September - October 2023 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?


ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే



























పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-40253096

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

లేదా

PhonePe

"Phone Pe"
no 9866 00 1678

QR code for Phone Pe

### సభ్యత్వ వివరాలు (2 సంవత్సరాలకు)

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరి |
|---|---|---|
| సాధారణ పోస్టు ద్వారా | 400/- | 1,000/- |
| రిజిష్టరు పోస్టు ద్వారా | 640/- | 1,240/- |

'గూగుల్ పే/ ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు లేదా ఈ క్యుఆర్ కోడ్ ద్వారా పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.